# నిత్యప్రార్థనా శ్లోకాలు

**భావార్థ రచన**
డాక్టర్ నొస్సం నరసింహాచార్య
ఉపసంపాదకులు, తి.తి.దేవస్థానములు

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
**2023**

**NITYAPRARTHANASLOKALU**

By

**Dr. Nossam Narasimhacharya**

T.T.D. Religious Publication Series No: 1463
© All Rights Reserved
First Edition : 2023

Copies: 500

*Published by :*
**Sri A.V. Dharma Reddy,** IDES
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P:*
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# ముందుమాట

హిందూ ధర్మం సనాతనమైనది. దీనికి వేదాలు మూలాలు. చరిత్రకందని కాలంనుండే భారతావని వేదభూమిగా పుణ్యభూమిగా విరాజిల్లుతూంది.

కాలగమనంలో హైందవంలో ద్వైత అద్వైత విశిష్టాద్వైత సిద్ధాంతాలు, శైవ, వైష్ణవ, శాక్తేయ, సౌర, గాణాపత్యాది అనేక ఆగమ సంప్రదాయాలు వచ్చినా అవన్నీ భగవదారాధనను తెలియజేస్తూ జనుల జీవితాలను పునీతం చేస్తున్నాయి.

భక్తులు ఉపాసకులు తమ తమ ఇష్టానుసారం ఎందరో దేవుళ్ళను ఆరాధిస్తుంటారు. అర్చిస్తుంటారు. స్తుతిస్తుంటారు. దేవతలకు నిలయమైన వివిధ దేవాలయాలను దర్శిస్తూంటారు. భగవంతుని పట్ల తమ భక్తి ప్రపత్తులను ప్రదర్శిస్తూంటారు.

యాంత్రికంగా మారిపోతున్న నేటి సమాజంలో చాలా వరకు పిల్లలనుండి పెద్దలవరకు ఏ దేవాలయానికి వెళితే ఏ స్తోత్రం పఠించాలో తెలియకుండాపోయింది. స్తోత్రం తెలిసినా యాంత్రికంగా పఠించడమేకానీ, అర్థం అసలే తెలియకుండా పోయింది. 'అర్థం లేని చదువు వ్యర్థం' అనికదా సూక్తి. హైందవ ధర్మప్రచారంలో భాగంగా అటువంటి వారికోసం నిత్యప్రార్థనాశ్లోకాలను తాత్పర్య–సహితంగా ముద్రిస్తున్నాము. ఇందులో వినాయకుడు మొదలుకొని లక్ష్మీ, సరస్వతి, పార్వతి, అన్నపూర్ణాదేవి, భూదేవి, తులసీదేవి, గోమాత, సుబ్రహ్మణ్యస్వామి, వైనతేయుడు, ఆదిశేషుడు, హనుమంతుడు, పరమేశ్వరుడు, మృత్యుంజయస్వామి, శ్రీమహావిష్ణు–మూర్తి, ధన్వంతరి, నరసింహ స్వామి, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీ

శ్రీనివాసుడు, నవగ్రహదేవతలు మున్నగు దేవతల ప్రార్థనాశ్లోకాలతో పాటు గురు ప్రార్థన శ్లోకాలు- వేదవ్యాస భగవానులు, జగద్గురు ఆదిశంకరాచార్యులు, భగవద్రామానుజాచార్యులు, జగద్గురు మధ్వాచార్యులు మున్నగు గురువుల ప్రార్థనాశ్లోకాలు తాత్పర్యంతో వ్రాయబడ్డాయి. భోజనాత్పూర్వ శ్లోకాలు కూడా తేట తెలుగులో అందరికి అర్థమయ్యే రీతిలో అందిస్తున్నాము.

నేటి బాలబాలికలు, విద్యార్థులు, యువకులు, పెద్దలు ఈ శ్లోకాలను పఠించడంద్వారా అర్థ సహితంగా తెలుసుకోవడం ద్వారా ఏ దేవతలను ఏ స్తోత్రాలతో ప్రార్థించాలో అవగతం అవుతుంది. తద్వారా ధార్మిక, ఆధ్యాత్మిక చింతనవైపు మార్గం సుగమం అవుతుంది.

ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని తిరుమల తిరుపతి దేవస్థానములు **నిత్యప్రార్థనాశ్లోకాలు** అనే ఈ పుస్తకాన్ని డా॥ నొస్సం నరసింహాచార్య గారితో వ్రాయించి ముద్రిస్తున్నది. వారికి దేవదేవుని కరుణాకటాక్ష వీక్షణలు మెండుగా ఉండాలని ఆకాంక్షి- స్తున్నాను.

**నిత్యప్రార్థనాశ్లోకాలు** అనే ఈ గ్రంథాన్ని పాఠకలోకం ఆదరిస్తుందని, సద్వినియోగం చేసుకుంటుందని ఆశిస్తున్నాను.

సదా శ్రీవారిసేవలో...



**కార్యనిర్వహణాధికారి**
తి.తి.దేవస్థానములు, తిరుపతి.

# మనవి

భారతదేశము పుణ్యభూమి. ఈ భూమిపై వేదాలు పురాణాలు ఇతిహాసాలు వెలిశాయి. ఈ భూమిపై శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీవేంకటేశ్వరుడు, మహాశివుడు, మహాలక్ష్మి, దుర్గాదేవి మున్నగు దేవీదేవతలు నడయాడారు. వేదవ్యాస, శుక, సూత, శౌనకాది ఎందరో మహర్షులు అవతరించారు. ఈ భూమి పరమ పావనమైన భూమి. గంగా, సింధూ, యమునాది పరమ పవిత్రమైన నదులు ప్రవహిస్తున్నాయి. ఈ భూమి ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లే భూమి. ఆదిశంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు వంటి మహనీయులుకు జన్మభూమి. ఇంతటి పరమ పవిత్రమైన భారతావనిలో మనమందరం ఎందరోమహనీయుల అనుయాయులుగా, అందులోను హిందువులుగా జన్మించడం మన పూర్వజన్మ సుకృతమే.

ఈ సృష్టిలో 84 లక్షల జీవరాశులు ఉన్నాయి. వాటిలో మానవుడు అత్యంత శ్రేష్ఠమైన బుద్ధిజీవి. అంతటి ఉత్తమమైన మానవునిగా అవతరించిన మీదట ఈ జన్మను సార్థకం చేసుకుని మోక్షసాధనకు కృషిచేయాలి. అరిషడ్వర్గాలకులోనై పాపకర్మలను అనుభవించి తిరిగి 84 లక్షల జీవరాశులలో ఏ పిపీలికంగానో, ఏ పశుపక్ష్యాదులు గానో జన్మించరాదు. కలియుగంలో భగవంతుని చేరుకునేందుకు, మోక్షసాధనకు అత్యంత సులభమైన ఏకైక సాధనం భగవన్నామస్మరణ. "**నామస్మరణా ధన్యోపాయం నహి పశ్యామి భవతరణే**" భవసాగరాన్ని దాటడానికి భగవన్నామస్మరణను మించిన ధన్యోపాయం మరొకటిలేదు. పరమాత్మను భక్తితో ఎప్పుడు ఎలా

ఏ పేరుతో పిలిస్తే, పరమాత్మ అప్పుడు అలా ఆ రూపంలో ప్రత్యక్షమవుతాడు. అయితే భక్తి అనేది ప్రధానమైనది. భక్తిలేకపోతే భగవానుడు మెచ్చడు. భక్తిలేకుండా బంగారాన్ని సమర్పించినా భగవానుడు స్వీకరించడు. భక్తితో పత్రం, పుష్పం, ఫలం, తోయం ఏది సమర్పించినా పరమాత్మ దానిని ప్రీతితో స్వీకరిస్తాడు.

నవవిధ భక్తిమార్గాలలో కీర్తనభక్తి ద్వితీయమైనా, అద్వితీయమైనది. కీర్తించడం అంటే స్తుతించడం. స్తోత్రం చేయడం. **"స్తోత్రం కస్య న తుష్టయే"** అనేది మహాకవి కాళిదాస సూక్తి. స్తుతి చేత ప్రసన్నులు కానివారు ఈ విశ్వంలో ఎవ్వరూ ఉండరు. సామ, దాన, భేద, దండోపాయాలలో సామం అనగా స్తోత్రం సర్వోత్తమమని విజ్ఞుల భావన. అందుకే వేద, పురాణ, ఇతిహాసాలు, కావ్యాలు అన్నీ స్తోత్ర విలసితాలై ఉన్నాయి.

యాంత్రికంగా మారిపోయిన మన ప్రస్తుత జీవనంలో సర్వోత్తమమైన మానవజన్మను ప్రసాదించిన, అందునా అమృతపుత్రులుగా, హిందువులుగా జన్మింపజేసిన పరమాత్మను ధ్యానించడానికి, స్తుతించడానికి చాలామంది కనీసం ఒక అరగంట సమయంకూడా కేటాయించలేకపోతున్నాము, సరికదా ఎప్పుడైనా ఏ దేవాలయానికి వెళ్ళినా ఆ దేవునిముందు మన కోరికల చిట్టాను విప్పడమే తప్ప ఒక్క స్తుతి, ఒక్క శ్లోకాన్ని పఠించలేని స్థితిలో నేడు చాలామందిమి ఉన్నాము. పోనీ, శ్లోకం వచ్చినా అర్థం తెలుసుకునే ప్రయత్నం చేయలేకపోతున్నాము. అర్థం లేని చదువు వ్యర్థం. అందుకే వివిధ దేవతలకు సంబంధించిన నిత్యపారాయణ శ్లోకాలను శ్రీనివాసుని కృపాకటాక్షాలతో ఈ పుస్తకంలో భావార్థ సహితంగా అందించే ప్రయత్నం చేస్తున్నాను.



సకలదేవతలకు సంబంధించిన **నిత్యప్రార్థనాశ్లోకాల**ను భావార్థంతో నేటి సమాజంకోసం సిద్ధంచేయమని భగవదనుజ్ఞగా నన్ను ఆదేశించిన తి.తి.దేవస్థానముల శ్రీకార్యనిర్వహణాధికారులు శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐడిఇఎస్., గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీమతి సదాభార్గవి, ఐ.ఏ.ఎస్., శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., గార్లకు నా హృదయపూర్వక ధన్యవాద సుమాంజలులు. ఈ గ్రంథాన్ని రూపొందించడంలో నన్ను ప్రోత్సహించిన ప్రచురణల విభాగ పూర్వ ప్రత్యేకాధికారి ఆచార్య రేమిళ్ళ వెంకటరామకృష్ణశాస్త్రి గారికి, ప్రస్తుత ప్రత్యేకాధికారి వ్యాఖ్యానబ్రహ్మ డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ గారికి, అక్షరాక్షరం పరిశీలించి తగిన సూచనలు సలహాలను అందించిన పెద్దలు, మహామహోపాధ్యాయ ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ గారికి, దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీ పి.ఆర్.ఆనందతీర్థాచార్యులు గారికి, ఆచార్య దక్షిణామూర్తి శర్మగారికి, కృతజ్ఞతాభివందనములు. అలాగే మా కార్యాలయ బృందానికి, ముఖ్యంగా డి.టి.పి. విభాగం వారికి, సకాలంలో చక్కగా ముద్రించి ఇచ్చిన తి.తి.దే ముద్రణాలయం ప్రత్యేకాధికారి వారికి, వారి సిబ్బందికి నా ప్రత్యేక ధన్యవాదములు.

**నాహం కర్తా హరిః కర్త తత్పూజా కర్మచాఖిలం**

**డా॥ నొస్సం నరసింహాచార్య**
ఉపసంపాదకులు,
తి.తి.దేవస్థానములు

———— ♦♦♦ ————



# నిత్యప్రార్థనాశ్లోకాలు



## 1.విఘ్నేశ్వర ప్రార్థన

**శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం ।**
**ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే ॥**

స్వచ్ఛమైన తెల్లటి వస్త్రాలను ధరించినవాడు, విశ్వమంతా వ్యాపించినవాడు, చంద్రుని వంటి వర్చస్సు కలిగినవాడు, నాలుగు భుజాలను కలిగినవాడు, ఆనందమైన ముఖారవిందం కలిగినవాడు అయిన ఆ పరమాత్ముని సమస్తమైన అడ్డంకులనూ తొలగించ-వలసినదిగా ప్రార్థిస్తున్నాను.

**అగజానన పద్మార్కం గజానన మహర్నిశం ।**
**అనేకదం తం భక్తానామ్ ఏకదంత ముపాస్మహే ॥**

పార్వతీదేవియొక్క ముఖకమలములకు సూర్యునివంటి వానిని, ఏనుగు ముఖం కలిగినవానిని, భక్తులకొరకు ఎల్లప్పుడు అనేక వరములను ప్రసాదించువానిని, ఏకదంతము కలిగినవానిని మేము ఆరాధిస్తున్నాము.

**వక్రతుండ మహాకాయ కోటిసూర్యసమప్రభ ।**
**నిర్విఘ్నం కురు మే దేవ సర్వకార్యేషు సర్వదా ॥**

వంపుతిరిగిన తొండమును, విశాలమైన శరీరమును కలిగి, కోటిసూర్యుల కాంతితో ప్రకాశించే ఓ దేవదేవా । మేము చేపట్టే అన్ని కార్యాలలో ఎదురయ్యే ఆటంకాలన్నింటిని తొలగించి పరిసమాప్తమయ్యేలా ఆశీర్వదించు స్వామి...

**వినాయక నమస్తుభ్యం సతతం మోదకప్రియ ।**
**నిర్విఘ్నం కురు మే దేవ సర్వకార్యేషు సర్వదా ॥**

ఎల్లప్పుడూ మోదకము(కుడుము)లందు ప్రీతి కలవాడవైన ఓ వినాయకా! నీకు నమస్కారములు. ఓ దేవా! నేను ఎల్లప్పుడూ చేపట్టే అన్ని కార్యములను విఘ్నములు కలుగకుండా అనుగ్రహించు స్వామీ!

**ఏకదంతం శూర్పకర్ణం గజవక్త్రం చతుర్భుజమ్ ।**
**పాశాంకుశధరం దేవం ధ్యాయేత్ సిద్ధి వినాయకమ్ ॥**

ఏకదంతుడు, చేటలవంటి చెవులు కలిగినవాడు, గజముఖుడు నాల్గు భుజములు కలవాడు, పాశాంకుశములు ధరించినవాడైన సిద్ధి వినాయకునికి నమస్కరిస్తున్నాను.

## సంకష్ట నాశన గణేశ స్తోత్రమ్

**నారద ఉవాచ-**

**ప్రణమ్య శిరసా దేవం గౌరీపుత్రం వినాయకమ్ ।**
**భక్తావాసం స్మరేన్నిత్యమాయుష్కామార్థసిద్ధయే ॥**



**ప్రథమం వక్రతుండం చ ఏకదంతం ద్వితీయకమ్ ।**
**తృతీయం కృష్ణపింగాక్షం గజవక్త్రం చతుర్థకమ్ ॥**

**లంబోదరం పంచమం చ షష్ఠం వికటమేవ చ ।**
**సప్తమం విఘ్నరాజం చ ధూమ్రవర్ణం తథాష్టమమ్ ॥**

**నవమం భాలచంద్రం చ దశమం తు వినాయకమ్ ।**
**ఏకాదశం గణపతిం ద్వాదశం తు గజాననమ్ ॥**

**ద్వాదశైతాని నామాని త్రిసంధ్యం యః పఠేన్నరః ।**
**న చ విఘ్నభయం తస్య సర్వసిద్ధికరం పరమ్ ॥**

**విద్యార్థీ లభతే విద్యాం ధనార్థీ లభతే ధనమ్ ।**
**పుత్రార్థీ లభతే పుత్రాన్మోక్షార్థీ లభతే గతిమ్ ॥**

**జపేద్గణపతిస్తోత్రం షడ్భిర్మాసైః ఫలం లభేత్ ।**
**సంవత్సరేణ సిద్ధిం చ లభతే నాత్ర సంశయః ॥**

**అష్టభ్యో బ్రాహ్మణేభ్యశ్చ లిఖిత్వా యః సమర్పయేత్ ।**
**తస్య విద్యా భవేత్సర్వా గణేశస్య ప్రసాదతః ॥**

**ఇతి శ్రీనారదపురాణే సంకష్టనాశనం నామ గణేశ స్తోత్రమ్**

దేవతలందరిచేత తొలిపూజలందుకునేవాడు, గౌరీపుత్రుడు, సకల విఘ్నాలకు అధిపతి అయిన వినాయకుడిని ధన ధాన్య ఆయురారోగ్య ఐశ్వర్యాల వృద్ధికొరకు నిరంతరం నమస్కరిస్తూ భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తున్నాను.

గణేశుని ద్వాదశనామాలు (12 పేర్లు)-మొదటిది వక్రతుండుడు అనగా వంపుతిరిగిన తొండం కలవాడు, రెండవది ఏకదంతుడు

ఒకే దంతం కలిగినవాడు,మూడవది కృష్ణపింగాక్షుడు అంటే ముదురు గోధుమరంగు కన్నులు కలిగినవాడు, నాలుగవది గజవక్త్రుడు అనగా ఏనుగు ముఖం కలిగినవాడు, ఐదవది లంబోదరుడు అనగా పెద్దపొట్ట గలవాడు, ఆరవది వికటుడు అంటే భారీకాయం గలవాడు, ఏడవది విఘ్నరాజేంద్రుడు అంటే సకలవిఘ్నాలకు అధిపతి అయినవాడు, ఎనిమిదవది ధూమ్రవర్ణుడు అంటే ముదురు గచ్చకాయరంగువంటి రంగు కలవాడు, తొమ్మిదవది భాలచంద్రుడు చంద్రుని శిరస్సున ధరించినవాడు, పదవది వినాయకుడు అంటే సకల విఘ్నాలకు నాయకుడు, పదకొండవది గణపతి అనగా దేవగణాలకు (ప్రమథగణాలకు) అధిపతి, పన్నెండు గజాననుడు అనగా ఏనుగుముఖం కలవాడు.

గణేశుని పన్నెండు నామాలతోకూడిన ఈ ద్వాదశనామ స్తోత్రాన్ని భక్తిశ్రద్ధలతో మూడు కాలాలలో పఠించిన వారికి జ్ఞానం కోరితే జ్ఞానం, ధనధాన్యాలు కోరితే ధనధాన్యాలు, పుత్రసంతానం కోరితే పుత్రసంతానం, మోక్షం కోరితే మోక్షం లభిస్తాయి. ఈ గణపతిస్తోత్రాన్ని ఆరు మాసాలు భక్తితో పఠించిన వారికి కోరిన ఫలితం లభిస్తుంది. ఒకసంవత్సరకాలం జపించిన వారికి అనుకున్న కార్యాలు తప్పక సిద్ధిస్తాయి. ఇందులో ఎటువంటి సందేహమూలేదు. ఈ సంకష్ట నాశన గణపతి స్తోత్రాన్ని ఎవరు భక్తి శ్రద్ధలతో వ్రాసి ఎనిమిది మంది బ్రాహ్మణులకు దానం చేస్తారో వారికి గణేశుని అనుగ్రహంతో సర్వము సిద్ధిస్తాయి.





## 2.సరస్వతీ దేవి ప్రార్థన

**సరస్వతి నమస్తుభ్యం వరదే కామరూపిణి ।**
**విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా ॥**

అమ్మా సరస్వతీదేవి నీవు కామరూపిణివి (సకలస్వరూపిణివి) అట్టి నీకు నమస్కరించి విద్యాభ్యాసాన్ని ఆరంభిస్తున్నాను. నాకు నిరంతరం ఈ విద్య సిద్ధించేలా అనుగ్రహించు తల్లీ..

**పద్మపత్రవిశాలాక్షీ పద్మకేసరవర్ణినీ ।**
**నిత్యం పద్మాలయా దేవీ సా మాం పాతు సరస్వతీ ॥**

పద్మపత్రాలవంటి విశాలమైన కన్నులు కలది, వికసిత పద్మంలోని కేసరాల వంటి ఎర్రని వర్ణము కలది, నిత్యము పద్మంలోనే విలసిల్లేది, అయిన సరస్వతి నన్ను నిరంతరం వీడక అనుగ్రహించు గాక!

**శారదా శారదాంభోజవదనా వదనాంభుజే ॥**
**సర్వదా సర్వదాస్మాకం సన్నిధిః సన్నిధిం క్రియాత్ ॥**

శరత్కాలంలో వికసించిన పద్మమువంటి ముఖం కలది, కోరిన కోర్కెలు నెరవేర్చునది అయిన శారద మా ముఖపద్మంనందు సదా వసించుగాక!

**యా కుందేందు తుషార హార ధవళా యా శుభ్రవస్త్రావృతా**
**యా వీణావరదండమండితకరా యా శ్వేతపద్మాసనా।**
**యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభిర్ దేవైస్సదా పూజితా।**
**సా మాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేషజాడ్యాపహా ॥**

మొల్లపువ్వు , చంద్రుడు, మంచుబిందువు, ముత్యాల దండల వలే తెల్లగా, స్వచ్ఛంగా ఉండి, (శుభ్రవస్త్రము) తెల్లని వస్త్రములను ధరించి, శ్రేష్ఠమైన వీణతో శోభిల్లే చేతులతో, తెల్లని పద్మమునందు ఆసీనురాలైనట్టిది, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాది సకల దేవతల చేత నిరంతరం పూజింపబడుతున్నది, భగవతి అయిన సరస్వతీ దేవి నా అజ్ఞానమును తొలగించి నన్ను ఎల్లప్పుడూ రక్షించుగాక.

**శుక్లాం బ్రహ్మవిచారసారపరమామాద్యాం జగద్వ్యాపినీం**
**వీణాపుస్తకధారిణీ మభయదాం జాడ్యాంధకారాపహాం ।**
**హస్తే స్ఫాటికమాలికాం విదధతీం పద్మాసనే సంస్థితాం**
**వందే తాం పరమేశ్వరీం భగవతీం బుద్ధిప్రదాం శారదామ్॥**

స్వచ్ఛమైన తెలుపు రంగును కలిగిన, బ్రహ్మ విచారసారమైన ఈ జగత్తునంతా వ్యాపించి ఉన్న, ఒకచేత వీణను, మరోచేత పుస్తకాన్ని ధరించి అభయహస్తంతో అజ్ఞానాంధకారాన్ని తొలగించేలా



అభయాన్ని ప్రసాదిస్తున్న, మరోచేత నిర్మలమైన స్ఫటికమాలను ధరించి, పద్మంలో ఆసీనురాలైఉన్న, పరమేశ్వరి, భగవతీ, బుద్ధిప్రదాయిని అయిన శారదాదేవికి నమస్కరిస్తున్నాను.




## 3.భూదేవి ప్రార్థన

**సముద్రవసనే దేవి పర్వతస్తనమండలే ।**
**విష్ణుపత్ని నమస్తుభ్యం పాదస్పర్శం క్షమస్వ మే ॥**

తల్లీ భూమాతా! సముద్రాన్ని వస్త్రంగా ధరించి, పర్వతాలనే స్తనములుగా కలిగిన నీవు విష్ణుపత్నివి. అటువంటి నీవు నా పాదస్పర్శను క్షమించు తల్లీ!

**విష్ణుశక్తిసముత్పన్నే శంఖవర్ణమహీతలే ।**
**అనేకరత్నసంభూతే భూమి! దేవి నమోఽస్తు తే ॥**

ఓ భూదేవీ ! నీవు విష్ణుశక్తి వలన ఉద్భవించినదానవు. శంఖము వంటి వర్ణము కలదానవు. అనేక రత్నాలకు నిలయమైనదానవు. అట్టి నీకు వందనములు తల్లీ !



## 4.తులసీ దేవి ప్రార్థన

**యన్మూలే సర్వతీర్థాని యన్మధ్యే సర్వదేవతా ః ।**
**యదగ్రే సర్వవేదాశ్చ తులసి త్వాం నమామ్యహమ్ ॥**

ఓ తులసీమాతా! నీ మూలభాగంలో సకల తీర్థాలు, మధ్య భాగంలో సకల దేవతలు, అగ్రభాగంలో సకల వేదాలు నివాస-ముంటాయి. అట్టి నీకు నమస్కారములు.

**నమస్తులసి సర్వజ్ఞే పురుషోత్తమవల్లభే।**
**పాహి మాం సర్వపాపేభ్య స్సర్వసంపత్ప్రదాయినీ॥**

ఓ తులసీమాతా! నీవు శ్రీహరిని భర్తగాపొందినదానవు. సకల సంపదలను ప్రసాదించుదానవు. సర్వము తెలిసినదానవు. మా పాపాలను తొలగించి మమ్ములను అనుగ్రహించు తల్లీ!





## 5.గోమాత ప్రార్థన

**సర్వకామదుఘే దేవి సర్వతీర్థాభిషేచిని ।**
**పావనీ సురభీ శ్రేష్ఠీ దేవి తుభ్యం నమోఽ స్తు తే ॥**

ఓ గోమాతా! నీవు సకల కోరికలను తీర్చేదానవు. సకల తీర్థాలను పాలరూపంలో ప్రసాదించేదానవు. పరమ పవిత్రమైన దానవు. హే సురభీ దేవీ నీకు వందనములు.

**గావో మే మాతరస్సర్వా గావో మే పితరస్తథా ।**
**గావో మమాగ్రతస్సంతు గావో మే సంతు పృష్ఠతః**
**గావో మే పార్శ్వత స్సంతు గవాం బృందే వసామ్యహమ్ ॥**

గోసంతతి నాకు మాతా, పితృ సమానములు. గోవులు నా ముందుభాగములోను, వెనక భాగములోను, నా ఇరువైపులా ఉండు గాక. గో సమూహంలో నేను వసింతును గాక.



**6.ఆది శేష ప్రార్థన**

**నమస్తే దేవదేవేశ ధరణీధర నమస్తే ।**
**నమస్తే సర్వ నాగేంద్ర ఆదిశేష నమోఽస్తు తే ॥**

హే దేవదేవా! నీకు వందనములు. నీవు భూగోళాన్ని పడగలపై ధరించి మోస్తున్నవాడవు. నీవు సకల నాగకులానికి అధిపతివి. హే ఆదిశేషా! నీకు వందనములు.



**7.వైనతేయ ప్రార్థన**

**కుంకుమాంకితవర్ణాయ కున్దేందుధవళాయ చ ।**
**విష్ణువాహ నమస్తుభ్యం, పక్షిరాజాయ తే నమః ॥**



ఓ విష్ణువాహనమైన గరుత్మంతా! నీవు కుంకుమ వలె ఎర్రటి రంగును, మొల్లవలె, చంద్రునివలె ప్రకాశమానమైన తెల్లని రంగును కలిగినవాడవు, పక్షులకు రాజు అయిన నీకు నమస్కారము.



**8.నందీశ్వర ప్రార్థన**

**నందీశ్వర నమస్తుభ్యం సాంబానందప్రదాయక ।**
**మహాదేవేశసేవార్థమనుజ్ఞాం దాతుమర్హసి ॥**

ఓ నందీశ్వరా! నీకు నమస్సులు. మహాదేవుడైన పరమేశ్వరునికి ఆనందం కలిగించేవాడా! మహాదేవుని సేవకు అనుజ్ఞనిమ్ము.



**9.దీప ప్రార్థన**

**దీపజ్యోతిః పరబ్రహ్మ దీపః సర్వతమోపహః ।**
**దీపేన సాధ్యతే సర్వంసంధ్యా దీప నమోఽస్తు తే॥**

జ్యోతి స్వరూపమైన దీపం సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపమైనది. దీపం అజ్ఞానం అనే అంధకారాన్ని పారద్రోలి జ్ఞానమనే వెలుగును

ప్రసరింపజేస్తుంది. అన్ని వైపులా వెలుగులు నింపే ఉదయ / సాయంకాల (సంధ్యా) దీపలక్ష్మికి నమస్కరిస్తున్నాను.

**శుభం కరోతి కల్యాణమారోగ్యం ధన సంపదమ్ ।**
**శత్రుబుద్ధివినాశాయ దీపజ్యోతిర్నమోఽస్తు తే ॥**

దీపజ్యోతి శుభాన్ని, మంగళాన్ని, ఆరోగ్యాన్ని, ధన సంపదలను ప్రసాదిస్తుంది. దుర్బుద్ధుల వినాశనానికై దీపజ్యోతికి నమస్కరిస్తున్నాను.

**వైరాగ్యతైలసంపూర్ణే భక్తివర్తిసమన్వితే ।**
**ప్రబోధపూర్ణపాత్రే తు జ్ఞానదీపం విలోకయేత్ ॥**

వైరాగ్యము అనే తైలము(నూనె)తో నిండిన, భక్తి అనే వత్తిని కలిగిన, పూర్ణజ్ఞానమనే పాత్రయందు జ్ఞానజ్యోతిని దర్శించాలి.

**దీప జ్యోతిః పరబ్రహ్మ దీపజ్యోతిర్జనార్దనః ।**
**దీపో హరతు మే పాపం దీపజ్యోతిర్నమోఽస్తు తే ॥**

దీపజ్యోతి పరబ్రహ్మ స్వరూపం. దీపం సాక్షాత్ జనార్దన స్వరూపమైనది. అట్టి దీపం నా పాపాలను హరించుగాక! ఓ దీపజ్యోతీ నీకు నమస్కారములు.





## 10.శ్రీమహాలక్ష్మీ దేవి ప్రార్థన

**లక్ష్మీం క్షీరసముద్రరాజతనయాం శ్రీరంగధామేశ్వరీం**
**దాసీభూతసమస్తదేవవనితాం లోకైకదీపాంకురాం ।**
**శ్రీమన్మందకటాక్షలబ్ధవిభవ బ్రహ్మేంద్రగంగాధరాం**
**త్వాం త్రైలోక్యకుటుంబినీం। సరసిజాం। వందే ముకుంద ప్రియాం॥**

ఓ లక్ష్మీ దేవీ! నీవు క్షీరసముద్రరాజ కుమార్తెవు. శ్రీరంగనాథుని ఇల్లాలివి. సమస్త దేవవనితలచేత సేవింపబడేదానవు, సకల లోకాలకు శుభాలను ప్రసాదించేదానవు. బ్రహ్మ, ఇంద్రుడు, శివుడు మున్నగువారు శ్రీమంతురాలవైన నీ చల్లని చూపులతో వైభవాన్ని పొందారు. అమ్మా! నీవు ముల్లోకాలకు తల్లివి. కమలం నుండి ఉద్భవించినదానవు. ముకుందునికి (శ్రీహరికి) ప్రియమైనదానవు అట్టి నీకు నమస్కరిస్తున్నాను తల్లీ!

**సిద్ధలక్ష్మీః మోక్షలక్ష్మీః జయలక్ష్మీః సరస్వతీ ।**
**శ్రీః లక్ష్మీః వరలక్ష్మీః చ ప్రసన్నా మమ సర్వదా ॥**

సకలార్థసిద్ధిని ప్రసాదించే సిద్ధలక్ష్మి, మోక్షాన్ని ప్రసాదించే మోక్షలక్ష్మి, చేపట్టే కార్యాలలో విజయాన్ని ప్రసాదించే జయలక్ష్మి, సకల విద్యలను ప్రసాదించే విద్యాలక్ష్మి(సరస్వతీదేవి), సిరిసంపదలను ప్రసాదించే శ్రీలక్ష్మి, వరాలను ప్రసాదించే వరలక్ష్మి నిరంతరం మాకు ప్రసన్నమవుగాక.

**మాతర్నమామి కమలే కమలాయతాక్షి ।**
**శ్రీవిష్ణుహృత్కమలవాసిని విశ్వమాతః ॥**
**క్షీరోదజే కమలకోమలగర్భగౌరి ।**
**లక్ష్మీం ప్రసీద సతతం నమతాం శరణ్యే ॥**

హే జగన్మాతా! నీవు కమలములో నివసించుదానవు, కమలపు రేకులవంటి కన్నులు కలదానవు. శ్రీ మహావిష్ణు హృదయకమలంలో నిరంతరం వసించేదానవు. క్షీరసాగరం నుండి ఉద్భవించిన దానవు. కోమలమైన కమలగర్భంలో ఆసీనురాలవైన దానవు. అట్టి మహాలక్ష్మీ దేవి నీకు నమస్కారములు. నిన్నే శరణు వేడుతున్న నన్ను అనుగ్రహించు తల్లీ!

**పద్మప్రియే పద్మిని పద్మహస్తే పద్మాలయే పద్మదళాయతాక్షి ।**
**విశ్వప్రియే విష్ణుమనోనుకూలే త్వత్పాదపద్మం మయి సన్నిధత్స్వ ॥**

పద్మమందు వసించే ఓ మహాలక్ష్మీదేవీ ! నీవు పద్మాలపట్ల అమితమైన ఆసక్తి గలదానవు. పద్మినివి. పద్మాలను చేతులలో ధరించినదానవు, పద్మపురేకుల వంటి కన్నులు కలదానవు. విశ్వ–వ్యాపకుడైన శ్రీహరికి ప్రియమైనదానవు. ఆతని మనసును ఎరిగిన–



దానవు. అట్టి నీ దివ్య పాదపద్మాలను (నాయందుంచు తల్లీ!) ఆశ్రయిస్తున్నాను తల్లీ!

**సరసిజనిలయే సరోజహస్తే ధవళతరాంశుక గన్ధమాల్యశోభే ।**
**భగవతి హరివల్లభే మనోజ్ఞే త్రిభువనభూతికరి ప్రసీద మహ్యమ్॥**

తల్లీ! నీవు పద్మమునందు వసించుదానవు. పద్మములను చేత ధరించినదానవు. స్వచ్ఛమైన తెల్లటి వస్త్రాలను ధరించినదానవు. సుగంధభరితమైన పుష్పమాలికలచేత అలంకరింపబడినదానవు. శ్రీహరిని వరించినదానవు. మనోజ్ఞమైన ఆకృతిని కలిగినదానవు. ముల్లోకాలకు ఐశ్వర్యాన్ని ప్రసాదించుదానవు. అట్టి ఓ జగన్మాతా! నాకు ప్రసన్నురాలవగుము.

**యా సా పద్మాసనస్థా విపులకటితటీ పద్మపత్రాయతాక్షీ,**
**గంభీరావర్తనాభిఃస్తనభరనమితా శుభ్రవస్త్రోత్తరీయా ।**
**లక్ష్మీర్దివ్యైర్గజేంద్రైర్మణిగణఖచితైః స్నాపితా హేమకుంభైః,**
**నిత్యం సా పద్మహస్తా మమ వసతు గృహే సర్వమాంగల్యయుక్తా॥**

పద్మపురేకులవంటి కనులను, లోతైన నాభిని, విశాలమైన కటిప్రదేశమును కలిగి స్తనభారముతో కొద్దిగా వంగిన, స్వచ్ఛమైన వస్త్రాలను ఉత్తరీయాన్ని ధరించిన, దేవలోకంలోని దివ్యగజాల చేత బంగారు కలశములలోని పవిత్ర జలాలతో నిత్యమూ అభిషేకింప–బడుతున్న, పద్మాలను చేతధరించి, పద్మమునందు ఆసీనురాలైన మంగళస్వరూపిణి శ్రీమహాలక్ష్మీదేవి ఎల్లప్పుడూ మా గృహమునందు వసించుగాక!

## అష్టలక్ష్మి ప్రార్థన



### ఆదిలక్ష్మి ప్రార్థన

**సుమనస వందిత! సుందరి! మాధవి! చంద్రసహోదరి! హేమమయే!**
**మునిగణవందిత! మోక్ష ప్రదాయిని! మంజులభాషిణి! వేదనుతే ।**
**పంకజవాసిని! దేవసుపూజిత సద్గుణవర్షిణి! శాంతియుతే!**
**జయ జయ హే మధుసూదనకామిని! లక్ష్మి సదా పరిపాలయ మామ్॥**

హే మధుసూదనుని వరించిన ఆదిలక్ష్మీ! నీకు జయము జయము. నీవు సుమనస్కులచేత పూజింపబడుదానవు. జగన్మంగళా–కారిణివి. మాధవివి(మధుమాసములో జనించినదానవు). చంద్రుని తోబుట్టువవు. స్వర్ణస్వరూపిణివి. మునిగణములచే నమస్కరింప–బడేదానవు. మోక్షప్రదాయినివి. మధురమైన, మంజులమైన వాక్కులను పలుకుదానవు. వేదాలచే స్తుతింపబడుదానవు. కమలంలో నివసించేదానవు. దేవతలచే పూజించబడుదానవు. సద్గుణములకు నిలయమై భక్తులను అనుగ్రహించేదానవు. శాంతస్వరూపిణివి. మమ్ము నిరంతరం సంరక్షించు తల్లీ!





### ధాన్యలక్ష్మి ప్రార్థన

**అయి కలికల్మషనాశిని! కామిని! వైదికరూపిణి! వేదమయే!**
**క్షీరసముద్భవ మంగళరూపిణి! మంత్రనివాసిని! మంత్రనుతే ।**
**మంగళదాయిని! అంబుజవాసిని! దేవగణాశ్రితపాదయుతే**
**జయ జయ హే మధుసూదనకామిని! లక్ష్మి సదా పరిపాలయ మామ్ ॥**

కలి ప్రభావాన్ని రూపుమాపి ఇష్టార్థాలను ప్రసాదించే హే ధాన్యలక్ష్మి నీవు వేదస్వరూపిణివి. వేదం నీలోనే ఉన్నది. క్షీరసాగరము నుండి జనించిన మంగళ స్వరూపిణివి, మంత్రనివాసినివి, మంత్రాలచే స్తుతింపబడేదానవు. శుభాలను ప్రసాదించేదానవు. కమలములో నివసించేదానవు. దేవగణాలచేత ఆశ్రయింపబడిన పాదాలు కలదానవు. హే మధుసూదనుని వరించిన ధాన్యలక్ష్మీ! నీకు జయము జయము. నిరంతరం మమ్ములను సంరక్షించు తల్లీ!



## ధైర్యలక్ష్మి ప్రార్థన

**జయ వరవర్ణిణి! వైష్ణవి! భార్గవి! మంత్రస్వరూపిణి! మంత్రమయే!**
**సురగణపూజిత శీఘ్రఫలప్రద జ్ఞానవికాసిని! శాస్త్రనుతే ।**
**భవభయహారిణి! పాపవిమోచని! సాధుజనాశ్రితపాదయుతే!**
**జయ జయ హే మధుసూదనకామిని! లక్ష్మి సదా పరిపాలయ మామ్॥**

ఓ ధైర్యలక్ష్మీ! నీవు భవబంధ భయాలను పోగొట్టి పాపాలను నశింపజేయుదానవు. వరాల వర్షాన్ని ప్రసాదించేదానవు. మహావిష్ణు దేవేరివి. భృగు వంశంలో జనించినదానవు. మంత్రస్వరూపిణివి. మంత్రమే నీవైన దానవు. దేవతలందరిచేత పూజలందుకునేదానవు. త్వరితగతిన ఫలాన్ని ప్రసాదించేదానవు. జ్ఞానాన్ని వికసింపజేసే–దానవు. మహర్షులచే ఆశ్రయించబడినపాదాలు కలదానవు. సకల శాస్త్రాలచేత నుతింపబడేదానవు. హే మధుసూదనుని వరించిన ధైర్యలక్ష్మీ ! నీకు జయము జయము. నిరంతరం మమ్ములను సంరక్షించు తల్లీ!





## గజలక్ష్మి ప్రార్థన

**జయ జయ దుర్గతినాశిని! కామిని! సర్వఫలప్రద శాస్త్రమయే!**
**రథగజ తురగపదాది సమావృత పరిజనమండిత లోకనుతే ।**
**హరిహర బ్రహ్మ సుపూజిత సేవిత తాపనివారణ పాదయుతే**
**జయ జయ హే మధుసూదనకామిని! లక్ష్మి సదా పరిపాలయ మామ్॥**

హే గజలక్ష్మీదేవీ! నీవు అన్ని కష్టాలను తొలగించి కోరిన కోర్కెలను ప్రసాదించేదానవు. సకలార్థ ప్రదాయినివి. శాస్త్ర స్వరూపిణివి. రథాలు, ఏనుగులు, గుర్రాలు, పదాతిదళాలనే చతురంగ బలాలచే కూడిఉండి, సకల లోకాలలోను నుతింపబడేదానవు. హరిహర బ్రహ్మాదులచేత పూజింపబడేదానవు. దుఃఖాలను నివారించే పవిత్ర పాదాలు కలదానవు. హే మధుసూదనుని వరించిన గజలక్ష్మీ! నీకు జయము జయము. నిరంతరం మమ్ములను సంరక్షించు తల్లీ!



## సంతానలక్ష్మి ప్రార్థన

**అయి ఖగవాహిని! మోహిని! చక్రిణి! రాగవివర్ధిని! జ్ఞానమయే**
**గుణగణవారిధి లోకహితైషిణి! స్వరసప్తభూషితగాననుతే ।**
**సకల సరాసుర దేవమునీశ్వర మానవ వందిత పాదయుతే**
**జయ జయ హే మధుసూదనకామిని! లక్ష్మి సదా పరిపాలయ మామ్॥**

ఓ సంతానలక్ష్మీ! నీవు గరుత్మంతుని వాహనంగా కలదానవు. ప్రేమను, జ్ఞానాన్ని ప్రసాదించేదానవు. సకల సద్గుణాలకు నిలయమై, లోకానికి హితాన్ని కూర్చుదానవు. సప్త స్వరాలతో అలంకృతమైన గానముతో కీర్తించబడుదానవు. సకల దేవదానవులచేత, మునీశ్వరులచేత, మానవులచేత పూజింపబడే పాదపద్మములు కలదానవు. అట్టి హే మధుసూదనుని వరించిన సంతానలక్ష్మీ! నీకు జయము జయము. నిరంతరం మమ్ములను సంరక్షించు తల్లీ!





## విజయలక్ష్మి ప్రార్థన

**జయ కమలాసని సద్గతిదాయిని జ్ఞానవికాసిని గానమయే**
**అనుదినమర్చిత కుంకుమధూసరభూషిత వాసిత వాద్యనుతే ।**
**కనకధరాస్తుతి వైభవ వందిత శంకర దేశిక మాన్యపదే**
**జయ జయ హే మధుసూదనకామిని! లక్ష్మి సదా పరిపాలయ మామ్॥**

అమ్మా! విజయలక్ష్మి నీకు జయము జయము. నీవు జ్ఞానాన్ని వికసింపజేసి సద్గతిని ప్రసాదించేదానవు. కమలనివాసినివి. ప్రతి నిత్యము అర్చించిన కుంకుమచే ఆవరించబడి ఉంటావు. మంగళ వాద్యములచే స్తుతింపబడుతుంటావు. శంకరాచార్యులు స్తుతించిన కనకధారాస్తుతికి ప్రసన్నురాలవై బంగారువర్షాన్నికురిపించినదానవు. అట్టి హే మధుసూదనుని వరించిన విజయలక్ష్మీ! నిరంతరం మమ్ములను సంరక్షించు తల్లీ!



## విద్యాలక్ష్మి ప్రార్థన

**ప్రణత సురేశ్వరి భారతి భార్గవి శోకవినాశిని రత్నమయే**
**మణిమయభూషిత కర్ణవిభూషణ శాంతిసమావృత హాస్యముఖే ।**
**నవనిధిదాయిని కలిమలహారిణి కామిత ఫలప్రద హస్తయుతే**
**జయ జయ హే మధుసూదనకామిని! లక్ష్మి సదా పరిపాలయ మామ్॥**

అమ్మా విద్యాలక్ష్మీ! నీవు దేవతలకు అధినాయకురాలవు. నీవే భారతివి, భార్గవివికూడాను. సకల దుఃఖాలను నివారించే దానవు. అమూల్యమైన రత్నాలకు నిలయమైనదానవు. వివిధ మణులచేత అలంకరింపబడినదానవు. అద్భుతమైన కర్ణాభరణములు ధరించిన-దానవు. నిరంతరం శాంతిని ప్రసాదించే ప్రసన్న వదనంతో, మందహాసంతో విరాజిల్లుతూ ఉంటావు. నవ నిధులను ప్రసాదించే-దానవు. కలి దోషాలను తొలగించి వరాలను ఇచ్చే వరదహస్తాన్ని కలిగి ఉంటావు. అట్టి హే మధుసూదనుని వరించిన విద్యాలక్ష్మీ! నీకు జయము జయము. నిరంతరం మమ్ములను సంరక్షించు తల్లీ!





## ధనలక్ష్మి ప్రార్థన

**ధిమిధిమి ధింధిమి ధింధిమి ధింధిమి దుందుభినాద సుపూర్ణమయే**
**ఘుమఘుమ ఘుంఘుమ ఘుంఘుమ ఘుంఘుమ శంఖనినాద సువాద్యనుతే।**
**వేదపురాణేతిహాస సుపూజిత వైదికమార్గ ప్రదర్శయుతే**
**జయ జయ హే మధుసూదనకామిని! లక్ష్మి సదా పరిపాలయ మామ్॥**

ఓ ధనలక్ష్మీదేవీ! నీవు ధిమిధిమి ధింధిమి అనే భేరీనినాదములతో పూరింపబడినదానవు. ఘుమఘుమ ఘుంఘుమ అను శంఖ-నాదముతో స్తుతింపబడుదానవు. వేదపురాణేతిహాసములతో పూజింపబడుదానవు. వైదిక మార్గమును ప్రదర్శించుదానవు. హే మధుసూదనుని వరించిన ధనలక్ష్మీ! నీకు జయము జయము. నిరంతరం మమ్ములను సంరక్షించు తల్లీ!



## 11.పార్వతీ దేవి ప్రార్థన

**సర్వమంగళ మాంగల్యే శివే సర్వార్థసాధికే ।**
**శరణ్యే త్ర్యంబకే దేవీ నారాయణి నమోఽస్తు తే ॥**

మంగళకరమైన వాటన్నిటిలోనూ అతి మంగళకరమైన, సర్వ మంగళ నామధేయురాలవైన, అన్ని అర్థములను సాధించి శరణు జొచ్చిన వారికి ఆశ్రయమిచ్చే, త్రినేత్రుని (శివుని) అర్ధాంగి అయిన ఓ పార్వతీదేవీ! ఓ నారాయణీ! నీకు నమస్కరిస్తున్నాను.





## 12.రాజరాజేశ్వరీ దేవి ప్రార్థన

**అంబా శాంభవి చంద్రమౌళిరబలాఽపర్ణా ఉమాపార్వతీ**
**కాళీ హైమవతీ శివా త్రినయనీ కాత్యాయనీ భైరవీ ।**
**సావిత్రీ నవయౌవనా శుభకరీ సామ్రాజ్యలక్ష్మీ ప్రదా**
**చిద్రూపీ పరదేవతా భగవతీ శ్రీరాజరాజేశ్వరీ ॥**

అమ్మా రాజరాజేశ్వరీదేవి! నీవు చంద్రుడిని శిరస్సున అలంకరించుకున్నదానవు. శాంభవివి. ఆకులను కూడా ఆహారంగా స్వీకరించకుండా తపస్సు చేసినదానవు(అపర్ణవు). ఉమాదేవివి. పార్వతివి. కాళికాదేవివి. హిమవంతుని కుమార్తెవు. మంగళ స్వరూపిణివి. త్రినేత్రములు కలదానవు. కాత్యాయనివి, భైరవివి. సావిత్రివి. నిత్యనూతనమైన యవ్వనం కలదానవు. శుభాలను ప్రసాదించేదానవు. సామ్రాజ్య సంపదలను ప్రసాదించేదానవు. చిద్రూపిణివి. ముల్లోకాలకు అధినాయకురాలవు. అట్టి నీకు నమస్కారములు తల్లీ.

**అంబా మోహిని దేవతా త్రిభువనీ ఆనన్దసంధాయినీ**
**వాణీ పల్లవపాణి వేణుమురళీగానప్రియాలోలినీ ।**
**కల్యాణీ ఉడురాజబిమ్బవదనా ధూమ్రాక్షసంహారిణీ**
**చిద్రూపీ పరదేవతా భగవతీ శ్రీరాజరాజేశ్వరీ ॥**

తల్లీ రాజరాజేశ్వరీదేవి! నీవు మోహనమైన రూపం కలదానవు. ముల్లోకాలలోని దేవతలకు ఆనందాన్ని ప్రసాదించేదానవు. సరస్వతివి. సుకుమారమైన చేతులు కలదానవు. వేణుగానం పట్ల అమితప్రేమ కలదానవు. మంగళ స్వరూపిణివి. చంద్రబింబం వంటి ముఖం కలదానవు. ధూమ్రాక్షుడనే అసురుని సంహరించినదానవు. చిద్రూపిణివి. ముల్లోకాలకు అధినాయకురాలవు. అట్టి నీకు నమస్కారములు తల్లీ.



## 13.లలితాదేవి ప్రార్థన

**సిందూరారుణ విగ్రహాం త్రినయనాం మాణిక్య మౌళిస్ఫురత్**
**తారానాయక శేఖరాం స్మితముఖీ మాపీన వక్షోరుహాం ।**
**పాణిభ్యా మళిపూర్ణ రత్న చషకం రక్తోత్పలం బిభ్రతీం**
**సౌమ్యాం రత్న ఘటస్థ రక్త చరణాం ధాయేత్పరామంబికాం ॥**



అమ్మా లలితాదేవీ! నీవు సిందూరంవంటి ఎర్రని శరీరం కలదానవు. త్రినయనివి. మాణిక్యములు పొదిగిన కిరీటమునందు తారానాయకుడైన చంద్రుణ్ణి అలంకారముగా కలిగినదానవు. చిరునవ్వుతోకూడిన ముఖముతో, ఉన్నతమైన వక్షస్థలముతో, చేత రత్నభాండమును, ఎర్రని కలువలను ధరించినదానవు. సౌమ్య స్వరూపిణివి. రత్నఘట్టమునందు ఎర్రని పాదాలను ఉంచి ప్రకాశించే దానవు. అట్టి నీకు నమస్కరిస్తున్నాను.

**ధ్యాయేత్ పద్మాసనస్థాం వికసిత వదనాం పద్మపత్రాయతాక్షీం**
**హేమాభాం పీతవస్త్రాం కరకలితలసద్ధేమపద్మాం పరాంగీమ్।**
**సర్వాలంకారయుక్తాం సతతమభయదాం భక్తనమ్రాం భవానీం**
**శ్రీవిద్యాం శాంతమూర్తిం సకలసురసుతాం సర్వసంపత్రదాత్రీమ్॥**

పద్మమునందు ఆసీనురాలై, వికసించిన ముఖంతో, పద్మపు-రేకులవంటి విశాలమైన కన్నులతో విరాజిల్లే, బంగారు రంగు పట్టువస్త్రాలను ధరించి, శ్రేష్ఠమైన అవయవాలతో, వివిధములైన అలంకారాలతో ప్రకాశిస్తూ, భక్తులకు అభయాన్ని ప్రసాదిస్తున్న, శ్రీవిద్యాస్వరూపిణీ, శాంతమూర్తి, సకలదేవతలచేత పూజింప-బడునదీ, సర్వసంపదలను ప్రసాదించునది అయిన శ్రీమాతకు (లలితాదేవికి) నమస్కరిస్తున్నాను.

**అరుణాం కరుణాతరంగితాక్షీం ధృత పాశాంకుశ పుష్పబాణచాపామ్।**
**అణిమాదిభిరావృతాం మయూఖైరహమిత్యేవ విభావయే భవానీమ్॥**

ఆపాదమస్తకం అరుణవర్ణంతో ప్రకాశిస్తున్న, నిరంతర కరుణా ప్రవాహముతో కూడిన కన్నులు కలిగిన, పాశ, అంకుశ, పుష్పబాణ, చాపాలను చేత ధరించిన, అణిమాది అష్టసిద్ధులతో పరివేష్టితమై ఉన్న భవానీదేవికి నమస్కరిస్తున్నాను.



**14.అన్నపూర్ణాదేవి ప్రార్థన**

**నిత్యానందకరీ వరాభయకరీ సౌందర్యరత్నాకరీ**
**నిర్ధూతాఖిల దోష పావనకరీ ప్రత్యక్షమాహేశ్వరీ ।**
**ప్రాలేయాచలవంశపావనకరీ కాశీపురాధీశ్వరీ**
**భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ॥**

మాతా అన్నపూర్ణేశ్వరీ! నీవు నిత్యము ఆనందమును, ఉత్తమమైన వరాలను ప్రసాదించుదానవు. సౌందర్యమునకు సముద్రము వంటిదానవు. ఘోరమైన సమస్త మహా పాపాలను దూరం చేయుదానవు. సాక్షాత్తు మహేశ్వరుని అర్ధాంగివి, హిమవంతుని ఇంట జనించి ఆతని వంశమును పావనం చేసినదానవు, కాశీపట్టణానికి అధీశ్వరివి, దయకు ఆధారభూతమైనదానవు. తల్లీ అన్నపూర్ణా! భిక్షను ప్రసాదించు తల్లీ! (ఇట భిక్ష అంటే జ్ఞానభిక్ష)



**అన్నపూర్ణే సదాపూర్ణే శంకరప్రాణవల్లభే ।**
**జ్ఞానవైరాగ్యసిద్ధ్యర్థం భిక్షాం దేహి చ పార్వతి ॥**

తల్లీ అన్నపూర్ణా దేవీ! నీవు నిరంతరం నిండుదనము కలదానవు. (సదా పూర్ణవు) పరమేశ్వరుని ప్రాణసతివి. పార్వతివి. జ్ఞానవైరాగ్యసిద్ధికొరకు మాకు భిక్ష (జ్ఞానభిక్ష) ను ప్రసాదించు తల్లీ!

**మాతా చ పార్వతీ దేవీ పితా దేవో మహేశ్వరః ।**
**బాంధవాశ్శివ భక్తాశ్చ స్వదేశో భువనత్రయమ్ ॥**

(సకల చరాచర సృష్టికి) పార్వతీదేవియే తల్లి, పరమేశ్వరుడే తండ్రి, శివభక్తులే బంధువర్గము. ముల్లోకాలే స్వదేశము.



**15.దుర్గాదేవి ప్రార్థన**

**సర్వస్వరూపే సర్వశక్తిసమన్వితే ।**
**భయేభ్యస్త్రాహి నో దేవి దుర్గాదేవి నమోఽస్తు తే ॥**
**సర్వబాధాప్రశమనం త్రైలోక్యస్యాఖిలేశ్వరి ।**
**ఏవమేవ త్వయా కార్యమస్మద్వైరి వినాశనమ్ ॥**

ఓ దుర్గాదేవీ! ఈ సమస్త సృష్టి నీ స్వరూపమే. నీవు సర్వశక్తిమంతురాలవు. సకల భయాలను దూరంచేసేదానవు. అట్టి నీకు నమస్కరిస్తున్నాను. అమ్మా నీవు ముల్లోకాలకు మూలపుటమ్మవు. సకల దుఃఖాలను పరిహరించేదానవు. శత్రుసంహారిణివి.



**16.పరమేశ్వర ప్రార్థన**

**వందే శంభుముమాపతిం । సురగురుం । వందే జగత్కారణం ।**
**వందే పన్నగభూషణం । మృగధరం। వందే పశూనాం పతిమ్॥**
**వందే సూర్య శశాంక వహ్ని నయనం । వందే ముకుంద ప్రియం।**
**వందే భక్తజనాశ్రయం చ వరదం । వందే శివం శంకరమ్ ॥**

భక్తజనులకు ఆశ్రయాన్ని కల్పించి కోరిన వరాలను ప్రసాదించే మంగళస్వరూపుడవైన శంకరా! నీకు నమస్సులు. హే శంభో! హే ఉమాపతీ! నీకు వందనం. సకలదేవతలకు గురుస్థానములో ఉన్నవాడవు, సృష్టికి కారకుడవు నీవే. సర్పములను ఆభరణాలుగా కలిగిన, మృగమును(జింకను) చేత అలంకారంగా కలిగిన, హే పశుపతీ! నీకు వందనం. సూర్యచంద్రులను రెండు నేత్రములుగాను, అగ్నిని మూడవ నేత్రంగాను కలిగిన హే త్రినేత్రా నీవు ముకుందునకు ప్రియమైనవాడవు మంగళస్వరూపా! శంకరా! నీకు నమస్సులు.



**శాంతం పద్మాసనస్థం శశిధరమకుటం పంచవక్త్రం త్రినేత్రం**
**శూలం వజ్రం చ ఖడ్గం పరశుమభయదం దక్షభాగే వహన్తం ।**
**నాగం పాశం చ ఘంటాం ప్రళయహుతవహం చాంకుశం వామభాగే**
**నానాలంకారయుక్తం స్ఫటికమణినిభం పార్వతీశం నమామి ॥**

శాంతుడు, పద్మాసనంతోనున్నవాడు, కిరీటమున చంద్రుని ధరించినవాడు, ఐదు ముఖములు కలవాడు, త్రినేత్రుడు, కుడివైపు చేతులలో శూలం, వజ్రం, ఖడ్గం, పరశు(గొడ్డలి), అభయముద్రను, ఎడమవైపు చేతులలో నాగం, పాశం, ఘంట, ప్రళయాగ్ని, అంకుశం ధరించిన వివిధ అలంకారాలతో కూడిన పార్వతీపతి అయిన స్ఫటికమణివంటి పరమేశ్వరునికి నమస్కరిస్తున్నాను.



**17.కాశీ విశ్వనాథ ప్రార్థన**

**గంగాతరంగ రమణీయ జటాకలాపం**
**గౌరీనిరంతర విభూషిత వామభాగం ।**
**నారాయణ ప్రియమనంగ మదాపహారం**
**వారాణసీ పురపతిం భజ విశ్వనాథమ్ ॥**

రమణీయమైన గంగా తరంగాలను తన జటలలో నిలిపిన వాడు, నిరంతరం తన శరీరంలోని ఎడమ భాగంనందు గౌరీదేవితో విలసిల్లేవాడు, నారాయణునికి అత్యంత ప్రియమైనవాడు, వారాణసి పురపతి అయిన విశ్వనాథునికి నేను నమస్కరిస్తున్నాను.



**18.మృత్యుంజయ స్వామి ప్రార్థన**

**త్రయంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనం ।**
**ఊర్వారుక మివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మామృతాత్ ॥**

సకల జీవరాశులను చక్కగా పోషించువాడు, సుగంధయుక్తుడు ఐన త్రినేత్రునికి నమస్కారము. ఊర్వారుకము(దోసపండు)ను తొడిమనుండి విడదీసినట్లుగా మృత్యువునుండి నన్ను విడదీసి అమృతత్వాన్ని ప్రసాదించు స్వామీ.





**19.దక్షిణామూర్తి ప్రార్థన**

**ఓం నమః ప్రణవార్థాయ శుద్ధజ్ఞానైకమూర్తయే ।**
**నిర్మలాయ ప్రశాంతాయ దక్షిణామూర్తయే నమః ॥**

ప్రణవనాదమైన ఓంకార స్వరూపుడు, స్వచ్ఛమైన జ్ఞానమే మూర్తిగా కలవాడు, నిర్మలాకారుడు, ప్రశాంతుడు అయిన దక్షిణామూర్తికి నమస్కరిస్తున్నాను.

**స్ఫటిక రజత వర్ణం మౌక్తికీ మక్షమాలాం**
**అమృతకలశవిద్యాం జ్ఞానముద్రాం కరాగ్రే ।**
**దధత మురగ కక్షం చన్ద్రచూడం త్రినేత్రం**
**విధృత వివిధ భూషం దక్షిణామూర్తి మీడే ॥**

స్ఫటికవలే, వెండివలే తెల్లని రంగు కలవాడు, ముత్యాల జపమాలను, అమృతకలశమును, విద్యారూపమైన గ్రంథమును, చిన్ముద్రను నాలుగు చేతులందు ధరించినవాడు, సర్పములను ఉపరి వస్త్రముగా ధరించినవాడు, శిరస్సున చంద్రుని చూడామణిగా ధరించినవాడు, త్రినేత్రుడు, వివిధ రకాలైన భూషణములను ధరించినవాడు అయిన దక్షిణామూర్తిని స్తుతిస్తున్నాను.



## 20.శివపంచాక్షరి స్తోత్రము

**నాగేంద్రహారాయ త్రిలోచనాయ ,**
**భస్మాంగరాగాయ మహేశ్వరాయ ।**
**నిత్యాయ శుద్ధాయ దిగంబరాయ**
**తస్మై "న" కారాయ నమః శివాయ ॥**

నాగేంద్రుని హారముగా ధరించినవాడు, మూడు కన్నులు కలవాడు, శరీరమంతా భస్మమును ధరించినవాడు, మహేశ్వరుడు, నిత్యుడు, శుద్ధుడు, దిగంబరుడు 'న' కార స్వరూపుడు అయిన శివునికి నమస్కరిస్తున్నాను.

**మందాకినీ సలిల చందన చర్చితాయ**
**నందీశ్వర ప్రమథనాథ మహేశ్వరాయ ।**
**మందార ముఖ్య బహుపుష్ప సుపూజితాయ**
**తస్మై "మ" కారాయ నమః శివాయ ॥**

మందాకినీ జలాలతో కూడిన చందనమును ధరించినవాడు, నందీశ్వరాది ప్రమథగణాలకు అధినాయకుడు, మహేశ్వరుడు,



మందారము మొదలైన అనేక ప్రముఖ పుష్పాలతో పూజింపబడే వాడు, 'మ' కార స్వరూపుడు అయిన శివునికి నమస్కరిస్తున్నాను.

**శివాయ గౌరీ వదనారవింద**
**సూర్యాయ దక్షాధ్వరనాశకాయ ।**
**శ్రీ నీలకంఠాయ వృషధ్వజాయ**
**తస్మై "శి" కారాయ నమః శివాయ ॥**

మంగళకరుడు, గౌరీదేవిముఖము అనే కమలమునకు సూర్యునివంటివాడు(ముఖకమలమును వికసింపజేసేవాడు), దక్షప్రజాపతి చేపట్టిన యజ్ఞమును నాశనం చేసినవాడు, నీలకంఠుడు, (హాలాహలం మ్రింగడం వల్ల ఏర్పడిన నల్లని కంఠం కలవాడు), వృషభధ్వజుడు 'శి' కారస్వరూపుడు అయిన శివునికి నమస్కరిస్తున్నాను.

**వసిష్ఠ కుంభోద్భవగౌతమాది**
**మునీంద్ర దేవార్చితశేఖరాయ ।**
**చంద్రార్క వైశ్వానరలోచనాయ**
**తస్మై "వ" కారాయ నమః శివాయ ॥**

వసిష్ఠ, అగస్త్య, గౌతమాది మునులచేత, దేవతలచేత అర్చించబడే దేవతాశ్రేష్ఠుడు, చంద్రుడు, సూర్యుడు, అగ్నులను మూడు కన్నులుగా కలవాడు, 'వ' కార స్వరూపుడు అయిన శివునికి నమస్కరిస్తున్నాను.

**యక్షస్వరూపాయ జటాధరాయ**
**పినాకహస్తాయ సనాతనాయ ।**
**దివ్యాయ దేవాయ దిగంబరాయ**
**తస్మై "య" కారాయ నమః శివాయ ॥**

యక్షస్వరూపుడు, శిరస్సున వెంట్రుకలు జడలుగా కలవాడు, పినాకమనే ధనస్సును చేత ధరించినవాడు, సనాతనుడు, దివ్యమైన వాడు, గొప్పగా ప్రకాశించేవాడు, దిగంబరుడు 'య' కార స్వరూపుడు అయిన శివునికి నమస్కరిస్తున్నాను.



## 21.సుబ్రహ్మణ్య స్వామి ప్రార్థన

**నిత్యాన్నదాననిరతం । సచ్చిదానందవిగ్రహం ।**
**సర్వరోగహరం దేవం । సుబ్రహ్మణ్యముపాస్మహే ॥**

నిత్యము అన్నదానం చేయువాడు, సచ్చిదానంద స్వరూపుడు, సర్వరోగాలను పోగొట్టువాడు, అయిన సుబ్రహ్మణ్య స్వామికి నమస్కరిస్తున్నాను.



**నమో అస్తు సర్పేభ్యో యే కే చ పృథివీమను ।**
**యే అంతరిక్షే యే దివి తేభ్యః సర్పేభ్యో నమః ॥**

సర్పములకు నమస్కారము. ఈ పృథివియందు అంతరిక్షము నందు, స్వర్గమునందు ఏ సర్పములైతే కలవో వాటికి నమస్కారము.



## 22. శ్రీకృష్ణ ప్రార్థన

**జయతు జయతు దేవో దేవకీనందనోయం**
**జయతు జయతు కృష్ణో వృష్ణివంశప్రదీపః ।**
**జయతు జయతు మేఘశ్యామలః కోమలాంగో**
**జయతు జయతు పృథ్వీభారనాశో ముకుందః ॥**

దేవకీనందనునికి జయము జయము. వృష్ణివంశ ప్రదీపకుడైన శ్రీ కృష్ణునకు జయము జయము. కోమలాంగుడు, మేఘశ్యామల–మూర్తి అయిన(కృష్ణ అంటే నీలమేఘవర్ణం) వానికి జయము జయము. ఈ భూమికి భారంగా మారినవారిని (దుర్మార్గులను, అధర్మవర్తనులను) నాశనం చేసే ముకుందునకు జయము జయము.

**నమో బ్రహ్మణ్యదేవాయ గోబ్రాహ్మణహితాయ చ ।**
**జగద్ధితాయ కృష్ణాయ గోవిందాయ నమో నమః ॥**

బ్రహ్మాది దేవతలచేత పూజలందుకునే దేవదేవుడు, గోబ్రాహ్మణుల హితమును కోరువాడు అయిన దేవదేవునకు నమస్కారములు.

**కృష్ణాయ వాసుదేవాయ హరయే పరమాత్మనే ।**
**ప్రణతక్లేశనాశాయ గోవిందాయ నమో నమః ॥**

కృష్ణునకు నమస్కారము, వాసుదేవునకు, శ్రీహరికి, పరమాత్మకు వందనము. భక్తులయొక్క సకల దుఃఖాలను నాశనం చేయువాడైన గోవిందునకు నమస్కారములు.

**కృష్ణాయ వాసుదేవాయ దేవకీనందనాయ చ ।**
**నందగోపకుమారాయ గోవిందాయ నమో నమః ॥**

శ్రీకృష్ణపరమాత్మా! నీవు వాసుదేవుడవు(వసుదేవసుతుడవు), దేవకీనందనుడవు, నందగోపుని కుమారుడవు. గోవిందా! నీకు నమస్కారములు.

**వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనం ।**
**దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥**

వసుదేవుని సుతుడు, కంసచాణూరులను సంహరించినవాడు, దేవకీదేవికి పరమానందాన్ని ప్రసాదించినవాడు, దేవదేవుడు, జగద్గురువు అయిన శ్రీకృష్ణపరమాత్మునికి వందనము.

**సచ్చిదానందరూపాయ జగదుత్పాదహేతవే ।**
**తాపత్రయనివారాయ శ్రీకృష్ణాయ నమో నమః ॥**



సచ్చిదానందరూపుడు, జగదుత్పాదహేతువు, తాపత్రయ–ములును (ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక తాపాలు) నివారించు వాడు అయిన శ్రీకృష్ణపరమాత్మునికి నమస్కరిస్తున్నాను.

**కరారవిందేన పదారవిందం**
**ముఖారవిందే వినివేశయంతం ।**
**వటస్య పత్రస్య పుటే శయానం**
**బాలం ముకుందం మనసా స్మరామి ॥**

ప్రళయకాలంలో కృష్ణుడు వటపత్రశాయియై బాల ముకుందునిలా ఎలా ఉంటాడో ఈ శ్లోకం వర్ణిస్తున్నది. ఒక చేత పాదమును పట్టుకొని, ఆ పాదమును ముఖారవిందమువద్దకు చేర్చి క్షీరసాగరముపై వటపత్రముపై శయనించి ఉండే బాలముకుందుని మనసారా స్మరిస్తున్నాను.

**కస్తూరీ తిలకం లలాటఫలకే వక్షస్థలే కౌస్తుభం**
**నాసాగ్రే నవ మౌక్తికం, కరతలే వేణుం, కరే కంకణం ।**
**సర్వాంగే హరిచందనం చ కలయన్ కంఠే చ ముక్తావళిమ్**
**గోపస్త్రీపరివేష్టితో విజయతే గోపాలచూడామణీ ॥**

నుదుటిపై కస్తూరికా తిలకమును, వక్షఃస్థలమున కౌస్తుభమణిని, ముక్కున మంచిముత్యపు బులాకిని అలంకరించుకున్నవాడు, చేతులకు కంకణములను, హస్తములందు వేణువును ధరించినవాడు, శరీరమంతా హరిచందనమును అలదుకుని, కంఠమందు ముత్యాలసరములు ధరించినవాడు, గోపవనితలచేత (పరివేష్టితుడు) చుట్టుముట్టబడిన గోపాలచూడామణి అయిన శ్రీకృష్ణునకు విజయము కలుగుగాక.



## 23.శ్రీమహావిష్ణు ప్రార్థన

**నమామి నారాయణపాదపంకజం**
**కరోమి నారాయణపూజనం సదా ।**
**వదామి నారాయణనామ నిర్మలం**
**స్మరామి నారాయణతత్త్వమవ్యయమ్ ॥**

శ్రీమన్నారాయణుని పాదపద్మాలకు వందనములు. నిరంతరం శ్రీమన్నారాయణునే ఆరాధిస్తాను. పవిత్రమైన నారాయణ నామాన్నే ఎల్లపుడు జపిస్తాను. మంగళకరమైన(నాశములేని) నారాయణతత్త్వాన్నే స్మరిస్తాను.

**శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం**
**విశ్వాధారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగం।**
**లక్ష్మీకాంతం కమలనయనం యోగిహృద్ధ్యానగమ్యం**
**వందే విష్ణుం భవ భయ హరం సర్వలోకైకనాథం ॥**



శాంతాకారుడు, ఆదిశేషునిపై శయనించినవాడు, నాభియందు పద్మం కలవాడు, దేవతలకు అధిపతి, విశ్వానికి ఆధారభూతుడు, ఆకాశసమానుడు, మేఘవర్ణం కలవాడు, మంగళకరమైన శరీరం కలవాడు, లక్ష్మీపతి, కమలపు రేకులవంటి కన్నులు కలవాడు, యోగుల హృదయాలలో నిరంతరం విహరించువాడు (ధ్యానంచే కనిపించువాడు), భవ భయాలను పోగొట్టువాడు సర్వలోకాలకు ఏకైకనాథుడు అయిన శ్రీమహావిష్ణువునకు వందనములు.

**మేఘశ్యామం పీతకౌశేయవాసం**
**శ్రీవత్సాంకం కౌస్తుభోద్భాసితాంగం।**
**పుణ్యోపేతం పుండరీకాయతాక్షం**
**విష్ణుం వందే సర్వలోకైక నాథం ॥**

నీలిమేఘపు వర్ణం కలవాడు, పసుపువర్ణంగల పట్టువస్త్రాలను ధరించినవాడు, వక్షఃస్థలమున శ్రీవత్సచిహ్నం కలవాడు, కౌస్తుభ-మణితో ప్రకాశమానంగా విరాజిల్లువాడు, పుణ్యాత్ములతో కూడుకున్నవాడు, తెల్ల కలువలవంటి కన్నులు కలవాడు, సకల లోకాలకు అధిపతి అయిన శ్రీమహావిష్ణువునకు నమస్కారములు.

**స శంఖచక్రం సకిరీటకుండలం**
**సపీతవస్త్రం సరసీరుహేక్షణం ।**
**సహారవక్షఃస్థలశోభికౌస్తుభం**
**నమామి విష్ణుం శిరసా చతుర్భుజం॥**

శంఖచక్రములు, కిరీటము, కుండలాలు, పసుపుపచ్చని పట్టువస్త్రములు ధరించినవాడు, కమలపు రేకులవంటి కన్నులు కలవాడు, విశాలమైన వక్షఃస్థలముపై కౌస్తుభమణితో శోభించేవాడు, చతుర్భుజుడు అయిన శ్రీమహావిష్ణువునకు శిరసువంచి నమస్కరిస్తున్నాను.

**వనమాలీ గదీ శార్ఙ్గీ శంఖీ చక్రీ చ నందకీ।**
**శ్రీమాన్ నారాయణో విష్ణుః వాసుదేవోఽభి రక్షతు॥**

వనమాలను, కౌమోదకీ గదను, శారఙ్గమనే కోదండమును, సుదర్శనచక్రమును, నందకమనే ఖడ్గమును ధరించిన శ్రీమన్నారాయణుడు మమ్ములను రక్షించుగాక.



## 24.శ్రీరామచంద్ర ప్రార్థన

**శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే ।**
**సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే॥**

శ్రీరామనామ మహత్త్వాన్ని తారక మంత్రాన్ని పరమేశ్వరుడు పార్వతీదేవికి ఉపదేశిస్తూ.. హే మనోరమే! (నా మనస్సును



ఆనందింపజేయుదానవు (రమింపజేయుదానవు) అయిన) పార్వతీ శ్రీరామ, రామ, రామ అనే ఈ తారకమంత్రము సహస్ర (వేయి) నామాలతో సమానమైనట్టిది. ఈ రామనామాన్ని ముమ్మారులు పఠిస్తే విష్ణు సహస్రనామాలను పఠించినంత ఫలితం లభిస్తుంది అని తెలియజేశాడు.

**రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే ।**
**రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః ॥**

శ్రీరాముడు, రామభద్రుడు రామచంద్రుడు, సృష్టికర్త, రఘు వంశపు రాజు, ప్రభువు, సీతాపతి అయిన శ్రీరామచంద్రునకు నమస్కారములు.

**శ్రీరాఘవం దశరథాత్మజమప్రమేయం**
**సీతాపతిం రఘుకులాన్వయరత్నదీపం ।**
**ఆజానుబాహుం అరవిందదలాయతాక్షం**
**రామం నిశాచర వినాశకరం నమామి ॥**

రఘువంశంలో జన్మించినవాడు, దశరథమహారాజ పుత్రుడు, ఊహలకందని (సౌందర్యంకల) వాడు, సీతాదేవికి భర్త, రఘుకులమనే క్షీరాబ్దిలో పుట్టిన చంద్రుడు, ఆజానుబాహుడు, తామర రేకులవంటి విశాలమైన కన్నులు కలవాడు, రాక్షసులను వినాశనం చేయువాడు అయిన శ్రీరామచంద్రునికి నమస్కరిస్తున్నాను.

**ఆపదామపహర్తారం, దాతారం సర్వసంపదామ్ ।**
**లోకాభిరామం శ్రీరామం భూయో భూయోనమామ్యహమ్॥**

ఆపదలను తొలగించువాడు, సకల సంపదలను ప్రసాదించు వాడు, లోకానికి ఆనందాన్ని కలిగించువాడు అయిన శ్రీరామునికి మరలా మరలా నమస్కరిస్తున్నాను.

**జయతు జయతు మంత్రం జన్మసాఫల్య మంత్రం**
**జనన మరణ దుఃఖ క్లేశ విచ్ఛేద మంత్రం ।**
**సకల నిగమ మంత్రం సర్వశాస్త్రైక మంత్రం**
**రఘుపతి నిజమంత్రం రామరామేతి మంత్రం॥**

జన్మను సఫలం చేసే మంత్రం, జననమరణ దుఃఖాలనే బాధలను పోగొట్టు మంత్రం, సకల వేదసారమైన మంత్రం, సర్వశాస్త్రాలు తెలిపే మంత్రం, రఘుపతిని తెలిపే మంత్రం రామ రామ అనే మంత్రం. అట్టి రామమంత్రానికి జయము కలుగుగాక.



**25.వేంకటేశ్వర స్వామి ప్రార్థన**

**కల్యాణాద్భుతగాత్రాయ కామితార్థప్రదాయినే ।**
**శ్రీమద్వేంకటనాథాయ శ్రీనివాసయ తే నమః ॥**



మంగళకరమైన అద్భుతమైన శరీరంతో ప్రకాశించేవాడు, కోరిన కోర్కెలను నెరవేర్చేవాడు, శ్రీవేంకటాచలానికి నాథుడు అయిన శ్రీనివాసునికి నమస్కరిస్తున్నాను.

**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥**

వేంకటాచలానికి సమానమైన పవిత్రక్షేత్రం కానీ, వేంకటేశ్వర స్వామికి సమానమైన దైవంకానీ ఈ బ్రహ్మాండంలోనే ఇంతకు-మునుపులేవు, ఇకముందు ఉండవు.

**శ్రీవేంకటేశం లక్ష్మీశం అనిష్టఘ్నమభీష్టదం ।**
**చతుర్ముఖాఖ్యతనయం శ్రీనివాసమహం భజే ॥**

శ్రీవేంకటేశ్వరుడు, లక్ష్మీదేవికి భర్త అయినవాడు, సకల అనిష్టాలను తొలగించువాడు, సకలాభీష్టాలను ప్రసాదించువాడు, చతుర్ముఖబ్రహ్మను తనయుడిగా కలవాడు, అయిన శ్రీనివాసునికి నేను నమస్కరిస్తున్నాను.

**నమోస్త్వనంతాయ సహస్రమూర్తయే సహస్రపాదాక్షి శిరోరుబాహవే ।**
**సహస్రనామ్నే పురుషాయ శాశ్వతే సహస్రకోటియుగధారిణే నమః ॥**

అనంతుడు(అంతంలేనివానికి), సహస్రావతారుడు, వేయి పాదాలు, కన్నులు, శిరస్సులు, చేతులు కలవాడు, వేయి నామాలు (పేర్లు) కలవాడు, సహస్రకోటి యుగాలను ధరించినవాడు, శాశ్వతుడు, పురుషోత్తముడు అయిన పరమాత్మునికి నమస్కరిస్తున్నాను.

**శ్రీ వేంకటాచలాధీశం శ్రియాధ్యాసితవక్షసం।**
**శ్రితచేతనమందారం శ్రీనివాసమహం భజే॥**

శ్రీవేంకటాచలానికి అధిపతి, లక్ష్మీదేవిచే అధిష్ఠించబడిన వక్షః స్థలం కలవాడు, ఆశ్రితుల కోర్కెలను నెరవేర్చువాడు అయిన శ్రీనివాసుని భజిస్తున్నాను.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి ।**
**హరే వేంకటేశ ప్రసీద ప్రసీద**
**ప్రియం వేంకటేశ ప్రయచ్ఛ ప్రయచ్ఛ ॥**

వేంకటేశ్వరుడుకాక నాకు వేరు దిక్కు ఇంకెవ్వరును లేరు. ఎల్లవేళల వేంకటేశ్వరుడినే స్మరిస్తాను. శ్రీహరీ! వేంకటేశ్వరా! ప్రసన్నుడవగుము కోరినకోర్కెలను ప్రసాదించుము. ప్రీతినిమ్ము.

**అహం దూరతస్తే పదాంభోజయుగ్మ**
**ప్రణామేచ్ఛయాఽగత్య సేవాం కరోమి ।**
**సకృత్సేవయా నిత్యసేవాఫలం త్వం**
**ప్రయచ్ఛ ప్రయచ్ఛ ప్రభో వేంకటేశ ॥**

ఓ వేంకటేశ్వరప్రభూ! నీ పాదకమలసేవకై భక్తితో ఎంతో దూరమునుండి వచ్చి కొలుచుచున్నాను. ఓ స్వామీ! ఒకమారు చేయు నీ సేవచేతనే నిన్ను నిత్యము సేవించే సేవాఫలము నాకు దయచేసి ప్రసాదించుము.



**ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద ఉత్తిష్ఠ గరుడధ్వజ ।**
**ఉత్తిష్ఠ కమలాకాంత త్రైలోక్యం మంగళం కురు ॥**

ఓ గోవిందా! నిద్రనుండి మేల్కొనుము. ఓ గరుడధ్వజా! వేగ లెమ్ము. ఓ కమలాపతీ! వేగ మేల్కొని ముల్లోకములకు శుభ మొనగూర్చుము.

**శ్రియః కాంతాయ కల్యాణనిధయే నిధయేఽర్థినామ్ ।**
**శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥**

లక్ష్మీదేవికి భర్త, సమస్తశుభములకు గనివంటివాడు, పేదలపాలిటి పెన్నిధి శ్రీవేంకటాచలమున నివసించువాడు అయిన శ్రీనివాసునకు మంగళ మగుగాక.

**లక్ష్మీ సవిభ్రమాలోక సుభ్రూ విభ్రమ చక్షుషే ।**
**చక్షుషే సర్వలోకానాం వేంకటేశాయ మంగళమ్ ॥**

లక్ష్మీదేవిని విలాసముతోచూచు సుందరములగు కనుబొమలు గల కన్నులు గలవాడును, ఎల్లలోకములకు కన్నువంటివాడైన శ్రీవేంకటేశ్వరునకు మంగళమగుగాక.

**సర్వావయవసౌందర్యసంపదా సర్వచేతసామ్ ।**
**సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్ ॥**

తన అన్ని అవయవముల సౌందర్యముచేత సమస్తజనులను సమ్మోహింపజేయు శ్రీవేంకటేశ్వరస్వామికి మంగళమగుగాక.

**ఓం నమో వేంకటేశాయ పురుషాయ మహాత్మనే ।**
**ప్రణత క్లేశనాశాయ గోవిందాయ నమో నమః ॥**

స్వామీ శ్రీవేంకటేశ్వరా! నీవు పురుషులలో సర్వశ్రేష్ఠుడవు. భక్తులయొక్క సకల దుఃఖాలను నివారించేవాడవు గోవిందా! అట్టి నీకు నమస్కారములు.



## 26.పద్మావతీ దేవి ప్రార్థన

**ఈశానాం జగతోஉస్య వేంకటపతే ర్విష్ణోః పరాం ప్రేయసీం**
**తద్వక్షఃస్థల నిత్యవాసరసికాం తత్-క్షాంతి సంవర్ధినీమ్ ।**
**పద్మాలంకృత పాణిపల్లవయుగాం పద్మాసనస్థాం శ్రియం**
**వాత్సల్యాది గుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్ ॥**

ఈ జగత్తునకు యజమానురాలు, సాక్షాత్ విష్ణుస్వరూపుడైన వేంకటాచలపతికి మిక్కిలి ప్రియురాలు, అతని క్షమాగుణము (ఓర్పు)ను పెంపొందింపజేయునట్టిది, తామరపూవులను అలంకారముగా తనచిగురుకేల దాల్చినది, పద్మాసనమున కూర్చుని ఉండునది, వాత్సల్యము మొదలైన మేలిగుణాలచే నిత్యము ప్రకాశించునది, ఎల్ల లోకములకు తల్లీ! భగవతీ! అయిన లక్ష్మీదేవికి నమస్కరిస్తున్నాను.





## 27.ధన్వంతరి ప్రార్థన

**శంఖం చక్రం జలౌకాం దధదమృతఘటం చారుదోర్భిశ్చతుర్భిః ।**
**సూక్ష్మస్వచ్ఛాతిహృద్యాం శుక పరివిలసన్మౌళిమంభోజనేత్రమ్ ॥**
**కాలాంభోదోజ్జ్వలాంగం కటితటవిలసచ్చారుపీతాంబరాఢ్యమ్ ।**
**వందే ధన్వంతరిం తం నిఖిలగదవనప్రౌఢదావాగ్నిలీలమ్ ॥**

సుందరమైన తన నాలుగు చేతులలో శంఖము, చక్రము, పుష్పము, అమృత కలశములను ధరించి, సూక్ష్మమైన, స్వచ్ఛమైన, అతిమనోహరమైన రామచిలుకలచే పరివృతమైన జడలతోకూడిన శిరస్సును, పద్మములవంటి కన్నులను కలిగిన, నీలిమేఘవర్ణముతో కూడిన అందమైన శరీరంతో నడుముపై పీతాంబరంను ధరించి విలసిల్లుతున్న, తన చల్లని చూపులతో సమస్త రోగాలు అనే అరణ్యాన్ని దావానలంలా దహించేవాడైన ధన్వంతరి పరమాత్మునికి నమస్కరిస్తున్నాను.

**అచ్యుతానంతగోవింద విష్ణో నారాయణాஉమృత ।**
**రోగాన్మే నాశయాஉశేషానాశు ధన్వన్తరే హరే ॥**

అచ్యుత, అనంత, గోవింద, విష్ణు, నారాయణ అనే నామామృతంతో అశేషమైన రోగాలను త్వరితగతిన నాశనము చేయు ధన్వంతరినామక పరమాత్మునికి నమస్కారములు.

**ఓం నమో భగవతే మహాసుదర్శనాయ వాసుదేవాయ ధన్వంతరయే అమృతకలశహస్తాయ సర్వభయవినాశాయ సర్వరోగనివారణాయ త్రైలోక్యపతయే త్రైలోక్యనిధయే శ్రీమహావిష్ణు స్వరూప శ్రీధన్వంతరీ స్వరూప శ్రీశ్రీశ్రీ ఔషధచక్రనారాయణ స్వాహ**

సుదర్శన వాసుదేవ ధన్వంతరిగా ప్రసిద్ధుడైన దేవదేవునకు నమస్కారములు. చేతిలో అమృతకలశాన్ని ధరించినవాడూ, అన్ని భయాలనూ పోగొట్టి, సర్వ రోగాలనూ నివారించేవాడూ, ముల్లోకాలకూ అధిపతి, ముల్లోకాలకూ శ్రేయస్సు చేకూర్చేవాడూ, మహా విష్ణు స్వరూపుడు, ధన్వంతరినామక పరమాత్ముడు శ్రీశ్రీశ్రీ ఔషధ చక్రనారాయణునికి నమస్కారములు. ఆ స్వామి కృప అందరినీ ఆరోగ్యవంతుల్ని చేయుగాక..

**అచ్యుతానంత గోవింద నామోచ్చారణ భేషజాత్ ।**
**నశ్యంతి సకలా రోగాః సత్యం సత్యం వదామ్యహమ్ ॥**

అచ్యుత అనంత గోవింద అనే నామాల ఉచ్చారణమనే ఔషధం వలన సకలరోగాలు నశిస్తాయి. ఇది సత్యం ఇదే సత్యం.

**ఆరోగ్యం దీర్ఘమాయుష్యం బలం తేజో ధియం శ్రియం ।**
**స్వభక్తేభ్యోఽనుగృహ్ణంతం వందే ధన్వన్తరిం హరిమ్ ॥**



తన భక్తులకు మంచి ఆరోగ్యాన్ని, దీర్ఘాయువును, బలాన్ని, తేజస్సును, కీర్తిని, సంపదలను అనుగ్రహించే ధన్వంతరినామక పరమాత్మునికి నమస్కరిస్తున్నాను.

**శరీరే జర్జరీభూతే వ్యాధిగ్రస్తే కళేబరే ।**
**ఔషధం జాహ్నవీ తోయం వైద్యో నారాయణో హరిః ॥**

శరీరం వ్యాధిగ్రస్తమై బలహీనమైనప్పుడు ఔషధమే గంగాజలం, వైద్యుడే నారాయణుడు శ్రీహరి (హరించువాడు).



## 28.హయగ్రీవ ప్రార్థన

**జ్ఞానానందమయం దేవం నిర్మల స్ఫటికాకృతిమ్ ।**
**ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవ ముపాస్మహే ॥**

జ్ఞానానందమయుడైన పరమాత్ముడు, నిర్మలమైన స్ఫటికవంటి వాడు, సర్వవిద్యలకు ఆధారభూతుడు అయిన హయగ్రీవ స్వామిని ఉపాసిస్తున్నాను. ఆరాధిస్తున్నాను.

**హయగ్రీవ హయగ్రీవ హయగ్రీవేతి వాదినం ।**
**నరం ముంచంతి పాపాని దరిద్రమివ యోషితః ॥**

హయగ్రీవ హయగ్రీవ హయగ్రీవ అని స్మరించినవారికి సకల పాపాలు, దారిద్ర్యము తొలగిపోతాయి.

**హయగ్రీవ హయగ్రీవ హయగ్రీవేతి యో వదేత్ ।**
**తస్య నిస్సరతే వాణీ జహ్నుకన్యా ప్రవాహవత్ ॥**

హయగ్రీవ హయగ్రీవ హయగ్రీవ అని ఎవరు స్మరిస్తారో, వారికి సరస్వతీకటాక్షం గంగాప్రవాహంలా కలుగుతుంది.

**హయగ్రీవ హయగ్రీవ హయగ్రీవేతి యో ధ్వనిః ।**
**విశోభతే స వైకుంఠ కవాటోద్ఘాటనక్షమః ॥**

హయగ్రీవ హయగ్రీవ హయగ్రీవ అని ఎవరు పలుకుతారో వారికి వైకుంఠద్వారాలు తెరుచుకుని వైకుంఠప్రాప్తి సిద్ధిస్తుంది.



## 29.నరసింహ ప్రార్థన

**శ్రీమత్పయోనిధి నికేతన చక్రపాణే**
**భోగీన్ద్రభోగమణిరాజిత పుణ్యమూర్తే ।**
**యోగీశ శాశ్వత శరణ్య భవాబ్ధిపోత**
**లక్ష్మీనృసింహ మమ దేహి కరావలమ్బమ్ ॥**



క్షీరసాగరమే నివాసగృహముగా కలవాడా! సుదర్శనచక్రమును చేత ధరించినవాడా! ఆదిశేషుని పాన్పుగా చేసుకొని ఆతని శిరస్సున ఉండే మణుల కాంతిచే ప్రకాశించు శరీరం కలవాడా! యోగీశా! సంసారసాగరాన్ని శాశ్వతంగా దాటించే శరణాగతవత్సలా!, లక్ష్మీనరసింహస్వామీ నాకు చేయూతనిమ్ము(రక్షింపుము).

**ప్రహ్లాదనారదపరాశరపుణ్డరీక–**
**వ్యాసాంబరీష శుకశౌనక హృన్నివాస ।**
**భక్తానురక్త పరిపాలన పారిజాత**
**లక్ష్మీనృసింహ మమ దేహి కరావలమ్బమ్ ॥**

ప్రహ్లాదుడు, నారదుడు, పరాశరుడు, పుండరీకుడు, వ్యాసుడు, అంబరీషుడు, శుకుడు, శౌనకుడు మున్నగువారి హృదయాలలో నివసించేవాడా! భక్త ప్రియా! భక్తులపాలిటి కల్పవృక్షమా! లక్ష్మీనరసింహస్వామీ నాకు చేయూతనిమ్ము(రక్షింపుము).

**మాతా నృసింహశ్చ పితా నృసింహః**
**భ్రాతా నృసింహశ్చ సఖా నృసింహః ।**
**విద్యా నృసింహో ద్రవిణం నృసింహః**
**లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబమ్**

హే లక్ష్మీ నారసింహా! నీవే తల్లివి, నీవే తండ్రివి, నీవే సోదరునివి, నీవే స్నేహితునివి, నీవే విద్యవు, నీవే ధనసంపదవు. (నిన్నే శరణు వేడుతున్నాను). లక్ష్మీనరసింహస్వామీ నాకు చేయూతనిమ్ము (రక్షింపుము).

## శ్రీ నరసింహ మహా మృత్యుంజయ మంత్రం

**ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతోముఖమ్।**
**నృసింహం భీషణం భద్రం మృత్యోర్ మృత్యుం నమామ్యహం॥**

ఇది శ్రీనృసింహ మృత్యుంజయ మహా మంత్రం.

ఇందులో వున్న ఒక్కొక్క నామం నరసింహస్వామియొక్క ఒక్కొక్క తత్త్వాన్ని తెలియజేస్తుంది.

ఉగ్రం అంటే... నరసింహస్వామి ఉగ్రమూర్తి. నరసింహస్వామి హూంకారాన్ని వింటేచాలు అంతర్గత, బహిర్గత శత్రునాశనం జరుగుతుంది.

వీరం అంటే.. సకల కార్యకారణాలకు మూలంగా వున్న శక్తినే వీరం అంటారు. నరసింహస్వామి వీరమూర్తి. కనుక సకల కార్యకారణస్వరూపుడు ఆయనే.

మహావిష్ణుం అంటే... అన్ని లోకాల్లో అంతటా ఉండే నరసింహ తత్త్వానికి ఈ నామం ప్రతీక. జ్వలంతం అంటే... సకల లోకాల్లో, సర్వాత్మల్లో తన తేజస్సును ప్రకాశింపజేయడం ద్వారా వాటి ప్రకాశానికి కారణమైన తత్త్వమే జ్వలంతం శబ్దానికి అర్థం.

సర్వతోముఖం అంటే... ఇంద్రియ సహాయం లేకుండా సకల విశ్వాన్ని చూడగల పరమాత్మ తత్త్వమే సర్వతోముఖత్వం.

నృసింహం అంటే.. సకల జీవుల్లో సింహం చాలా శ్రేష్ఠమైనది మృగేంద్రుడు. సింహాన్ని ఒకరు రాజుగా ఎన్నుకోవలసిన అవసరం



లేదు. తన పరాక్రమంచేత తనే స్వయంగా రాజుగా ప్రకటించు-కుంటుంది. భగవద్గీతలో శ్రీకృష్ణుడు 'మృగాణాం చ మృగేంద్రోఽహమ్'. అన్నాడు. కనుకనే పరమాత్మ లోకాలను ఉద్ధరించడానికి శ్రేష్ఠమైన సింహాకృతి ప్రధానంగా నరసింహుడుగా ఆవిర్భవించాడు.

భీషణం అంటే... నరసింహుని శాసనశక్తి ప్రతీక భీషణత్వం. శ్రీహరి దశావతారాలలోకెల్లా అత్యంత భయంకరమైన రూపం ఇది.

భద్రం అంటే.. భయాన్ని కలిగించే భీషణుడైన పరమాత్మే ఆ భయాన్ని పోగొట్టి అభయాన్ని కూడా ఇస్తాడు. ఇదే భద్రత్వం.

మృత్యుమృత్యుం అంటే.. స్మరణ మాత్రం చేత అప మృత్యువును దూరం చేసేవాడు. మృత్యువుకే మృత్యువైనవాడు నరసింహుడు మాత్రమే. మృత్యువును కలిగించేదీ, మృత్యువును తొలగించేది కూడా ఆ స్వామి అనుగ్రహమే. అట్టి నరసింహస్వామికి నమస్కరిస్తున్నాను.



## 30.ఆంజనేయ స్వామి ప్రార్థన

**బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వమరోగతా ।**
**అజాడ్యం వాక్పటుత్వం చ హనూమత్ స్మరణాత్ భవేత్ ॥**

ఓ ఆంజనేయస్వామీ! నీ స్మరణ చేతనే బుద్ధి, బలం, కీర్తి, ధైర్యం, నిర్భయత్వం(భయంలేకుండా ఉండటం) అరోగత్వం (ఎటువంటిరోగాలు లేకుండా ఉండడం) చక్కటి వాక్పటిమ సిద్ధిస్తాయి. అట్టి నీకు నమస్కారములు.

**మనోజవం మారుత తుల్యవేగం**
**జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠం ।**
**వాతాత్మజం వానర యూథముఖ్యం**
**శ్రీరామదూతం శిరసా నమామి ॥**

మనోవేగం కన్నా వేగం కలవాడు, వాయువేగంతో సమానమైన వేగం కలవాడు, ఇంద్రియములను జయించినవాడు, బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు, వాయుదేవుని పుత్రుడు, వానరసేనలలో ప్రముఖుడు, శ్రీరామదూత అయిన ఆంజనేయస్వామికి శిరస్సువంచి నమస్కరిస్తున్నాను.

**హనుమాన్ అంజనాసూనుః వాయుపుత్రో మహాబలః ।**
**రామేష్ట ఫల్గుణసఖః పింగాక్షో అమితవిక్రమః ॥**
**ఉదధిక్రమణశ్చైవ సీతాసందేశకారకః (శోక వినాశకః) ।**
**లక్ష్మణప్రాణదాతా చ దశగ్రీవస్య దర్పహా ॥**

**ద్వాదశైతాని నామాని కపీంద్రస్య మహాత్మనః**
**స్వాపకాలే ప్రబోధే చ యాత్రాకాలే చ యః పఠేత్ ।**
**తస్య మృత్యు భయం నాస్తి, సర్వత్ర విజయీ భవేత్**
**రాజద్వారే గహ్వరే చ భయం నాస్తి కదాచన ॥**



హనుమంతుడు, అంజనీసుతుడు, వాయుపుత్రుడు, మహా బలంకలవాడు, శ్రీరామచంద్రునికి ఇష్టమైనవాడు, అర్జునమిత్రుడు, పింగళవర్ణపు కన్నులు కలవాడు, సాటిలేని పరాక్రమం కలవాడు, సముద్రాన్ని లంఘించి సీతాదేవి సందేశాన్ని శ్రీరామునికి తెలియ-జేసినవాడు, సంజీవని పర్వతాన్ని తెచ్చి లక్ష్మణునికి ప్రాణదానం చేసినవాడు, రావణుని గర్వాన్ని అణచినవాడు, అనే ఈ ద్వాదశ-నామాలను (పన్నెండు పేర్లను) నిద్రాకాలంలో, మేల్కొన్న తరువాత, బయటకు వెళ్ళేముందు, యుద్ధకాలంలో(ఆపత్కాలంలో) ఎవరు పఠిస్తారో వారికి విజయం చేకూరుతుంది. రాజులవల్ల(అధికారుల వల్ల), కపటోపాయాలవల్ల ఎటువంటి భయము ఉండదు.

**ఆంజనేయమతిపాటలాననం**
**కాంచనాద్రికమనీయవిగ్రహమ్ ।**
**పారిజాతతరుమూలవాసినమ్**
**భావయామి పవమాననందనమ్ ॥**

ఎరుపు వర్ణ ముఖము కలవాడు, మేరుపర్వతమువలె సమున్నతమైన శరీరం కలవాడు, పారిజాత వృక్షమూలమున నివసించువాడు, వాయుదేవుని పుత్రుడు అయిన ఆంజనేయస్వామికి నమస్కారములు.

**యత్ర యత్ర రఘునాథ కీర్తనమ్**
**తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్।**
**బాష్పవారిపరిపూర్ణలోచనం**
**మారుతిం నమత రాక్షసాంతకమ్ ॥**

రాక్షసాంతకుడైన హనుమంతుడు శ్రీరామచంద్రుని ఎక్కడెక్కడ కీర్తిస్తారో అక్కడక్కడ శిరసున చేతులు జోడించి నమస్కరిస్తూ, ఆనందబాష్పాలతో కూడిన నేత్రాలతో ఉంటాడు. అట్టి మారుతికి నమస్కారములు.

**అంజనానందనం వీరం జానకీశోకనాశనమ్**
**కపీశమక్షహంతారం, వందే లంకా భయంకరమ్ ॥**

అంజనాదేవి కుమారుడు, జానకి జాడను శ్రీరామునికి తెలియజేయడం ద్వారా జానకీ దేవి దుఃఖాన్ని నివారించినవాడు, అక్షకుమారుని అంతం చేసినవాడు, లంకానగరానికే భయాన్ని కల్పించినవాడు, కపీశ్వరుడు అయిన ఆంజనేయునికి నమస్కారములు.



## 31.సూర్య ప్రార్థన

**ఆదిదేవ నమస్తుభ్యం ప్రసీద మమ భాస్కర ।**
**దివాకర నమస్తుభ్యం ప్రభాకర నమోఽస్తు తే ॥**

ఆదిదేవా నీకు నమస్కారము. భాస్కరా నాకు ప్రసన్నుడవగుము. పగటి కాలానికి అధిపతి అయినవాడా నీకు నమస్కారము. కాంతివంతమైనవాడా నీకు నమస్సులు సమర్పిస్తున్నాను.



**సప్తాశ్వరథమారూఢం ప్రచండం కశ్యపాత్మజం ।**
**శ్వేతపద్మధరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్ ॥**

ఏడు దివ్యాశ్వాలను పూన్చిన రథాన్ని అధిరోహించినవాడు, తీవ్రమైన కిరణములు కలవాడు, కశ్యపమహర్షి పుత్రుడు, తెల్లని పద్మాలను చేత ధరించినవాడు, దేవదేవుడు అయిన సూర్యునికి నమస్కరిస్తున్నాను.



## 32.నవగ్రహదేవతా ధ్యాన శ్లోకం

**ఆదిత్యాయ చ సోమాయ మంగళాయ బుధాయ చ ।**
**గురు శుక్ర శనిభ్యశ్చ రాహవే కేతవే నమః ॥**

నవగ్రహాది దేవతలైన సూర్యుడు, చంద్రుడు, అంగారకుడు, బుధుడు, బృహస్పతి, శుక్రుడు, శనీశ్వరుడు, రాహువు, కేతువులకు నమస్కరిస్తున్నాను.



## సూర్య ప్రార్థన

**జపాకుసుమసంకాశం కాశ్యపేయం మహాద్యుతిమ్ ।**
**తమోఽరిం సర్వపాపఘ్నం ప్రణతోఽస్మి దివాకరమ్ ॥**

మందార పువ్వు (జపా కుసుమం) రంగుతో ప్రకాశిస్తున్న, కశ్యప ప్రజాపతి వంశములో జన్మించిన, మహోజ్జ్వలమైన కాంతితో వెలుగొందుతూ సర్వ పాపాలను పోగొట్టువాడైన, దివాకర (పగటి–కాలానికి అధిపతి) అనే నామముతో పిలవబడుతున్న సూర్య భగవానునికి నమస్కరిస్తున్నాను.



## చంద్ర ప్రార్థన

**దధిశంఖ తుషారాభం క్షీరార్ణవసముద్భవం (క్షీరోదార్ణవ సంభవం)।**
**నమామి శశినం సోమం శంభో–ర్మకుట భూషణమ్ ॥**



పెరుగు, శంఖము, మంచుతో సమానమైన తెల్లని రంగు కలిగినవాడు, పాలసముద్రము నుండి పుట్టినవాడు(క్షీరసాగర మథనములో), కుందేలు (శశినం) వంటి గుర్తు తనపై కలిగినవాడు, పరమేశ్వరుని (శివుని) కిరీటమునందు ఆభరణముగా అలంకరింప–బడినవాడు అయిన చంద్రునకు నా నమస్కారములు.



## అంగారక (కుజ) ప్రార్థన

**ధరణీ గర్భసంభూతం విద్యుత్కాంతి సమప్రభమ్ ।**
**కుమారం శక్తిహస్తం తం మంగళం ప్రణమామ్యహమ్ ॥**

భూదేవి గర్భాన జన్మించినవాడు, మెరుపు వంటి కాంతితో ప్రకాశించువాడు, హస్తమునందు శక్తి అను ఆయుధాన్ని ధరించినవాడు అయిన మంగళ (అంగారక) నామముతో పిలువబడుతున్న కుజునకు నా ప్రణామములు.



**బుధ ప్రార్థన**

**ప్రియంగు కలికాశ్యామం రూపేణా ప్రతిమం బుధమ్ ।**
**సౌమ్యం సౌమ్య (సత్వ) గుణోపేతం తం బుధం ప్రణమామ్యహమ్॥**

కదంబపుష్పపు మొగ్గ వంటి లేత ఆకుపచ్చని రంగు కలిగిఉండి, సాటిలేని మేటి ఆకారం కలవాడు, సౌమ్యుడు, సౌమ్య గుణాలతో విరాజిల్లేవాడు అయిన బుధునికి నా నమస్కారములు.



**బృహస్పతి (గురు) ప్రార్థన**

**దేవానాం చ ఋషీణాం చ గురుం కాంచనసన్నిభమ్ ।**
**బుద్ధిమంతం త్రిలోకేశం తం నమామి బృహస్పతిమ్ ॥**

దేవతలకు, ఋషులకు గురువైనవాడు, బంగారు వర్ణముతో ప్రకాశించువాడు, బుద్ధిమంతుడు, తెలివైనవాడు, మూడు లోకాలకు గురువైన బృహస్పతికి (గురువునకు) నా నమస్కారములు.





**శుక్ర ప్రార్థన**

**హిమకుంద మృణాళాభం దైత్యానాం పరమం గురుమ్ ।**
**సర్వశాస్త్ర ప్రవక్తారం భార్గవం ప్రణమామ్యహమ్ ॥**

మంచు, మొల్లపువ్వులు, తామర తూడులతో పోలిక కలిగిన వాడు, దైత్యులకు (అసురులకు) పరమ గురువు, సకల శాస్త్ర పారంగతుడు, సమర్థుడు, భార్గవుడగు శుక్రునకు నా ప్రణామములు.



**శనైశ్చర ప్రార్థన**

**నీలాంజన సమాభాసం రవిపుత్రం యమాగ్రజమ్ ।**
**ఛాయా మార్తాండ సంభూతం తం నమామి శనైశ్చరమ్ ॥**

నల్లని కాటుకవంటి రంగుతో ప్రకాశించువాడు, సూర్యుని పుత్రుడు, యమునకు సోదరుడు, ఛాయా దేవి, సూర్యునికి జన్మించిన వాడు అయిన శనైశ్చరునకు నేను నమస్కరిస్తున్నాను.



రాహు ప్రార్థన

**అర్ధకాయం మహావీరం చంద్రాదిత్య విమర్దనమ్ ।**
**సింహికా గర్భ సంభూతం తం రాహుం ప్రణమామ్యహమ్ ॥**

అర్ధ శరీరము కలవాడు, మహా వీరుడు, చంద్రుణ్ణి, సూర్యుణ్ణి పీడించువాడు, హిరణ్యకశిపుని సోదరి అగు సింహిక గర్భమున జన్మించినవాడు అయిన రాహువునకు నా ప్రణామములు.



కేతు ప్రార్థన

**పలాశ పుష్ప సంకాశం తారకాగ్రహమస్తకమ్ ।**
**రౌద్రం రౌద్రాత్మకం ఘోరం తం కేతుం ప్రణమామ్యహమ్ ॥**



మోదుగ పువ్వు వంటి రంగుతో ప్రకాశిస్తూ, నక్షత్రాలకు, గ్రహాలకు శిరస్సువలే ఉంటూ భయము కలిగించే (పాపులకు), రౌద్ర స్వరూపముతో, భయానకంగా కనపడుతున్నవాడు (తప్పులు చేయువారికి) అయిన కేతువునకు నా వందనములు.

## 33.స్నానమంత్రం

**గంగే చ యమునే చైవ గోదావరి సరస్వతి ।**
**నర్మదే సింధు కావేరి జలేఽస్మిన్ సన్నిధిం కురు ॥**

ఓ గంగా, యమునా, గోదావరీ, సరస్వతీ, నర్మదా, సింధూ, కావేరీ ఈ జలాలలో వసించుము.

## 34.రక్షామంత్రం

**అగ్రతో నారసింహశ్చ పృష్ఠతో గోపినందనః ।**
**ఉభయోః పార్శ్వయో రాస్తౌ సశరౌ రామలక్ష్మణౌ ॥**

ముందుభాగంలో నరసింహస్వామి, వెనుకభాగంలో గోపినందను–డైన శ్రీకృష్ణుడు, ఇరుప్రక్కల ధనుర్ధారులైన రామలక్ష్మణులు ఉండి నన్ను రక్షించుగాక.



**35.గురు ప్రార్థన**

**గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।**
**గురుస్సాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః ॥**

గురువు బ్రహ, విష్ణు, మహేశ్వర స్వరూపుడు. గురువు సాక్షాత్తు పరబ్రహ్మస్వరూపుడు. అట్టి గురుదేవునికి నమస్కరిస్తున్నాను.



**36.వేదవ్యాస ప్రార్థన**

**వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।**
**నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥**

వేదవ్యాస స్వరూపుడగు శ్రీమహావిష్ణువునకు, శ్రీమహావిష్ణు స్వరూపుడగు వేదవ్యాసునికి నమస్కారములు. వేదనిధిని కలిగి-



ఉన్నవాడు, వసిష్ఠమహర్షి వంశమున అవతరించినవాడు అయిన వేదవ్యాసునికి నమస్కారములు.

**వ్యాసం వసిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమకల్మశం ।**
**పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్ ॥**

వసిష్ఠ మహర్షికి మునిమనుమడు, శక్తి మహర్షికి మనుమడు, పరాశరమహర్షికి కుమారుడు, శుకమహర్షికి తండ్రి, కల్మషం లేనివాడు తపోనిధి అయిన వ్యాసమహర్షికి నమస్కారములు.



**37.ఆదిశంకరాచార్య ప్రార్థన**

**శ్రుతిస్మృతిపురాణానామాలయం కరుణాలయం ।**
**నమామి భగవత్పాదం శంకరం లోకశంకరమ్ ॥**

శ్రుతి, స్మృతి, పురాణాలకు, అపారమైన కరుణకు నిలయమైన, లోకానికి సకల శుభాలను ప్రసాదించే పరమేశ్వర స్వరూపులైన శ్రీ శంకరభగవత్పాదులకు నమస్కరిస్తున్నాను.



## 38.భగవద్రామానుజాచార్య ప్రార్థన

**యో నిత్యమచ్యుత పదాంబుజ యుగ్మరుక్మ**
**వ్యామోహతస్తదితరాణి తృణాయ మేనే ।**
**అస్మద్గురోః భగవతోఽ స్య దయైకసింధోః**
**రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే ॥**

శాశ్వతములైన శ్రీమన్నారాయణుని దివ్యపాదాంబుజములనెడి బంగారముమీద వ్యామోహము కలిగి తదితరములన్నింటిని గడ్డిపరకవలే భావించునట్టి కరుణాసముద్రులు, భగవత్స్వరూపులు, మా ఆచార్యులు అయిన శ్రీరామానుజుల పాదములను ఆశ్రయిస్తున్నాను.

**శ్రీరంగరాజ చరణాంబుజ రాజహంసః**
**శ్రీవేంకటేశ కరుణా కలశార్ణవేందుః ।**
**శ్రీదేవరాజ జయ డిండిమ వాఙ్మయశ్రీః**
**రామానుజో విజయతే యతిరాజరాజః ॥**


శ్రీరంగరాజ చరణకమలములందు రాజహంస, శ్రీ వేంకటేశ–కరుణా అనే సముద్రమునకు చంద్రుడు, శ్రీ కాంచీపుర దేవరాజ



స్వామికి జయజయధ్వానముచేయు డిండిమ క్వణముతోకూడిన వాఙ్మయ శ్రీరూపులు, యతిరాజులకు రాజు అయిన రామానుజులు సర్వోత్కృష్టులై విరాజిల్లుచున్నారు.

**శేషో వా సైన్యనాథో వా శ్రీపతిర్వేతి సాత్త్వికైః ।**
**ఇతి సర్వైర్వితర్క్యాయ యతిరాజాయ మంగళమ్ ॥**

ఆదిశేషుడో, విష్వక్సేనుడో సాక్షాత్ విష్ణుదేవుడో అని సాత్త్వికు–లందరిచేత స్తుతింపబడుతున్న యతిరాజులకు మంగళమగుగాక.



## 39.శ్రీమన్ మధ్వాచార్య ప్రార్థన

**ప్రథమో హనుమన్నామా ద్వితీయో భీమయేవ చ ।**
**పూర్ణప్రజ్ఞస్తృతీయస్తు భగవత్కార్యసాధకాః ॥**

భగవత్కార్య సాధనకై వాయుదేవుడు మూడు అవతారాలను ధరించాడు. అందులో మొదటిది త్రేతాయుగంలో హనుమంతుని అవతారం. రెండవది ద్వాపరయుగంలో భీమసేనుని అవతారం. కలియుగంలో పూర్ణప్రజ్ఞులు (మధ్వాచార్యులు) గా అవతారం. అట్టి

భగవత్కార్యసాధకులైన హనుమ, భీమ, మధ్వాచార్యులకు నమస్కరిస్తున్నాను.

**యో విప్రలంభ విపరీత మతిప్రభూతాన్**
**వాదాన్నిరస్య కృతవాన్ భువితత్త్వవాదం ।**
**సర్వేశ్వరో హరి రితి ప్రతిపాదయంతం**
**ఆనందతీర్థ మునివర్యమహం నమామి ॥**

ఎవరైతే వేదాది వాఙ్మయముల అసలైన అర్థాలను వంచనచేత దాచిపెట్టి దోషపూరిత అర్థాలచేత వాదనచేస్తున్నారో అట్టివారి వాదనను నిరాకరించి 'శ్రీహరియే సర్వోత్తముడు' అని ప్రతిపాదిస్తూ ఈ భూలోకంలో వేదవాఙ్మయానికి సరియైన అర్థాన్ని (తత్త్వార్థాన్ని/యథార్థాన్ని) స్థిరపరిచారో అట్టి ఆనందతీర్థ మునివర్యులకు (శ్రీమన్ మధ్వాచార్యులకు) నేను నమస్కరిస్తున్నాను.

**వ్యాసాయ భవనాశాయ శ్రీశాయ గుణరాశయే ।**
**హృద్యాయ శుద్ధవిద్యాయ మధ్వాయ చ నమో నమః ॥**

ఎవరి నామస్మరణచేత సంసార భవబంధాలు తొలగిపోతాయో, అట్టి లక్ష్మీపతి, అనంతకల్యాణగుణనిధి, మనోహరమైన, పరిశుద్ధమైన విద్యాస్వరూపులు అయినట్టి వేదవ్యాస భగవానులకు మరియు వారి శిష్యులైన మధ్వాచార్యులకు నమస్కరిస్తున్నాను.





## 40.రాఘవేంద్రస్వామి ప్రార్థన

**పూజ్యాయ రాఘవేంద్రాయ సత్యధర్మవ్రతాయ చ ।**
**భజతాం కల్పవృక్షాయ నమతాం కామధేనవే ॥**

భజించువారికి కల్పవృక్షము, నమస్కరించువారికి కామధేనువు, సత్యధర్మములను వ్రతముగా కలిగినటువంటి పూజనీయులైన రాఘవేంద్రస్వామివారికి నమస్కరిస్తున్నాను.



## 41.భోజన పూర్వ శ్లోకం

భోజనం చేసేముందు అన్నపూర్ణాదేవి ప్రార్థనతోపాటు ఈ క్రింది గీతాశ్లోకాలను పారాయణం చేయడం ఆనవాయితి.

**బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్ ।**
**బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మ కర్మ సమాధినా ॥**

శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో అర్జునునితో ఇలా అంటున్నాడు. అర్జునా! యజ్ఞకార్యములలో ఉపయోగించే స్రుక్స్రువాది సాధనములు

బ్రహ్మము. హోమము చేయబడు ద్రవ్యములు బ్రహ్మము. అగ్ని బ్రహ్మము. యజ్ఞక్రియను ఆచరించే కర్త మరియు యజ్ఞము బ్రహ్మము. ఈ బ్రహ్మకర్మ యందు స్థితుడైన యోగిద్వారా పొందే యజ్ఞఫలము కూడా బ్రహ్మమే.

**అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।**
**ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥**

అర్జునా! నేను ప్రాణాపానసమాయుక్తమైన వైశ్వానరాగ్నిగా సర్వప్రాణుల శరీరంలో ఉంటూ వారు భుజించిన నాలుగు విధాలైన ఆహారాన్ని జీర్ణంచేస్తుంటాను.

## 42.సమర్పణా శ్లోకం

**త్వదీయం వస్తు గోవింద తుభ్యమేవ సమర్పయే ।**
**గృహాణ సుముఖో భూత్వా ప్రసీద పరమేశ్వర ॥**

ఓ గోవిందా! నీవు అనుగ్రహించిన దానిని తిరిగి నీకే సమర్పిస్తున్నాను. దీనిని స్వీకరించి ప్రసన్నుడవగుము స్వామీ!

**యదక్షర పదభ్రష్టం మాత్రాహీనం చ యద్భవేత్ ।**
**తత్సర్వం క్షమ్యతాం దేవ నారాయణ నమోస్తుతే ॥**

స్వామీ! శ్రీమన్నారాయణా! నీకు నమస్సులు. ఇందులో అక్షర దోషములు, పద దోషములు, ఛందో దోషములు (స్వరదోషములు) ఉన్నట్లయితే వాటన్నింటినీ దయతో మన్నించు స్వామీ!

**శ్రీకృష్ణార్పణమస్తు**